701738
A... PRADESH

కుష్టు సమస్త మహా వ్యాధులకు
బొల్లి మొదట నెలలో 40% నివారణ!!! 10% నివారణ!!
లెప్సిన్ అమోఘ ఔషధము!!!
వివరములకు గ్రంథే రఘురామగుప్త
అమర జ్యోతి ప్రొడక్ట్స్ ఎమ్మిగనూరు. కర్నూలు జిల్లా.

VISALAANDHRA, VIJAYAWADA-4. Phone. 376
* * * Regd No. H-203

విశాలాంధ్ర

సంపుటి 14 సంచిక 122] విజయవాడ • 16-7-1964 గురువారం [6 పేజీలు 7 పై.

'కమ్యూనిస్టుపార్టీ నాయకత్వానికి కార్మికోద్యమం అండవుంది'

కలకత్తాలో కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడు

శ్రీ రాజేశ్వరరావు పత్రికాగోష్ఠి

పార్టీ ఐక్యం కావాలనేదే తమ వాంఛ అని పునరుద్ఘాటన

కలకత్తా, జూలై 15

"కమ్యూనిస్టుపార్టీ ఐక్యం కావాలనేదే మా గాఢ వాంఛ, పార్టీ నుండి చీలిపోయినవారు సైతం సంస్థలో తిరిగి ప్రవేశించే అవకాశం అట్టేపెట్టివుంచాము. అయితే పార్టీ ప్రాథమిక నిర్మాణ సూత్రాలకు బద్ధులై వుండడానికి వారు సమ్మతించాలి" అని భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు శ్రీ చంద్ర రాజేశ్వరరావు నేడిక్కడ పత్రికాగోష్ఠిలో చెప్పారు.

భారత కమ్యూనిస్టుపార్టీ నాయకత్వానికి బలమైన కార్మికోద్యమం అండవుందనీ, అందువల్ల కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకొని పోగలమని శక్తి స్తోమత పార్టీకి గలదనీ అన్నారు.

నిన్న మొన్న యిక్కడ జరిగిన పశ్చిమ బెంగాల్ రాష్ట్ర సమితి సమావేశంలో శ్రీ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి స్థాయి నాయకత్వంలో మార్పేమీ ఉండదని అన్నారు.

శ్రీ డాంగే నాయకత్వం గురించి ప్రస్తావించి "ఆయన చాలా సమర్థుడైన నాయకుడు ఆయన కార్మికోద్యమాన్ని నిర్మించారు. అందుకోసం అనేక బాధలను భరించారు" అన్నారు.

బెంగాల్‌లో పార్టీబలం

[illegible] ఆదివారం నాడు రాష్ట్రసమితి కార్యదర్శివర్గం ఎన్నికను పర్యవేక్షించామనీ, పార్టీ జాతీయ సమితిని అనుసరించేవర్గం బలంపట్ల ఈ సమితిలో విశ్వాసం యేర్పడిందనీ ఆయనచెప్పారు. వీరికి కార్మికోద్యమంలోగూడా తగినంత బలం వుందని వెల్లడైందన్నారు.

పశ్చిమ బెంగాల్‌లో తమకే పూర్తి మెజారిటీ వుందనే పోటీపార్టీ వారి వాదనను ఆయన తిరస్కరించారు "నిజంగా వారికి బలమేవుంటే వారు పార్టీ నుండి వైదొలగి వుండేవారు కాదు గదా?" అని ప్రశ్నించారు.

పోటీపార్టీవారికి కొన్ని ప్రాంతాలలో స్థానికమైన పలుకుబడి వుందనీ, మధ్యేమార్గవాదులనబడే వారు కొన్ని బలమైన కార్మికసంఘాలకు నాయకత్వం వహిస్తున్నారనీ అన్నారు.

"పశ్చిమబెంగాల్లో పార్టీ నిర్మాణానికి కృతనిశ్చయులమైనాం. అందుకు దృఢ దీక్షతో పనిచేస్తాం. జాతీయ సమితి అనుసరిస్తున్న రాజకీయసంకారల్ల మాకు పూర్తి విశ్వాసముంది" అని ఆయన అన్నారు.

మధ్యే మార్గవాదులు గట్టి పై ఉండి తీసుకొని, రాష్ట్రంలోని పార్టీ ఉద్యమం యీనాటి గందరగోళపరిస్థితికి [illegible] అభిప్రాయాన్ని ప్రకటించారు.

"పోటీపార్టీ ముఠా తీవ్ర గందరగోళంలో పడిందని నా అభిప్రాయం. ఎందుకంటే వారు ఉద్యమాన్ని ముందుకు తీసుకొని పోవడంలో విఫలమైనారు. సూత్రబద్ధమైన పద్ధతుల్లో పార్టీ నిర్మాణానికి పూనుకుంటున్నాం. పోటీ పార్టీ నుండి, మధ్యే మార్గవాదుల నుండి హెచ్చుమంది కార్యకర్తలు మాలో వచ్చి చేరగలరని ఆశిస్తున్నాం"

'ప్రాథమిక పార్టీ నిర్మాణ సూత్రాలకు బద్ధులై వుండటానికి సమ్మతిస్తే, పార్టీనుండి చీలిపోయినవారికి సైతం, సంస్థలో తిరిగి ప్రవేశించే అవకాశం అట్టేపెట్టివుంది' అని ఆయన అన్నారు.

'పార్టీలోని అన్నిగ్రూపులూ ఐక్యమవాలనేదే మా కోర్కె. అందుకు సమ్మతించేది లేనిది తేల్చుకోవలసినవారు ఎదుట పక్షంవారే. తమ స్వీయప్రయోజనాల దృష్ట్యానూ, మొత్తం పార్టీప్రయోజనం దృష్ట్యాగూడా సాధారణ ఎన్నికలు వచ్చేనాటికి పోటీపార్టీ వారి ఆవేశాలు చల్లారగలవని ఆశిస్తున్నాను" అన్నారు.

"వాస్తవికమైన కార్యక్రమం ఆధారంగా, జరిపే గట్టి నిర్మాణ కృషిద్వారా మాకు పెద్ద మెజారిటీ లభించితీరుతుంది. వాస్తవిక దృష్టితో రూపొందించబడిన కార్యక్రమం ప్రాతిపదికగా ప్రజాసేకొన్ని కార్యాచరణకు సమీకరించగలమనే విశ్వాసం మాకుంది" అని శ్రీ పి. సి. జోషి చెప్పారు.

బందరులో కమ్యూనిస్టు లెవ్వరినీ అరెస్టు చేయలేదు

కొన్ని పత్రికల దుష్ప్రచారంపై కమ్యూనిస్టు కార్యదర్శి ఖండన

బందరు, జూలై 14

బందరుపట్టణ కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి శ్రీ ఎం. శ్రీహరిరావుగారు ఈ క్రింది ప్రకటన చేస్తున్నారు:

'ఇటీవల 'ఆంధ్రప్రభ' పత్రికలో 'బందరులో ముగ్గురు కమ్యూనిస్టుల అరెస్టు జూన్‌లో బొమ్మరులో జరిగిన గృహదహన సందర్భంలో" అనేక శీర్షికలతో వచ్చిఅబద్ధాన్ని ప్రకటించాడు. "ఆంధ్రజ్యోతి"లో కూడా "ముగురు కమ్యూనిస్టులపై చార్జిషీటు" అని వచ్చిఅబద్ధపు ప్రకటనవచ్చింది. బందరులో కమ్యూనిస్టు లెవ్వరినీ అరెస్టు చెయ్యలేదు. కమ్యూనిస్టు పార్టీకి యీ గృహదహనాలకు ఎటువంటి సంబంధమూ లేదు. కొంత మంది సంఘ వ్యతిరేకులు పని కట్టుకొని కమ్యూనిస్టు పార్టీపై పచ్చి అబద్ధాలు ప్రచారంలో పెట్టి ప్రజలలో పార్టీని అప్రతిష్టపాలు చెయ్యాలనే దుర్బుద్ధితో చేస్తున్నది తప్ప మరేమీకాదు."

మతతత్వ పార్టీల నిషేధానికి మసానీ విముఖత

రాజకోట, జూలై 14

మతతత్వ పార్టీల నిషేధానికి స్వతంత్ర పార్టీ వ్యతిరేకమని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ మసానీ నేడిక్కడ చెప్పారు. శ్రీ మసానీ నేడిక్కడ పత్రికా విలేకరులతో ముచ్చటిస్తూ, మతతత్వాన్ని రాజకీయంగా ఓడించి బహిష్కరించవలసిందేగాని శాసనంతో నిరోధించరాదని ఆయన ఖైన్‌కమిటీ నివేదిక గురించి ప్రస్తావిస్తూ అన్నారు.

అణ్వస్త్రాల విధ్వంసన

అమెరికా మొండి వైఖరివల్ల అంగీకారం కుదరని స్థితి

జెనీవా, జూలై 14

అణ్వస్త్రాల విధ్వంసాన్ని గూర్చి పరిశీలించడానికి ఒక ప్రత్యేక ఉపసంఘాన్ని నియమించేందుకు తాము ఇంతవరకు అంగీకారానికి రాలేకపోయామని అమెరికా, సోవియట్ యూనియన్‌లు నేడు ఐరాస నిరాయుధీకరణ మహాసభకు తెలిపాయి.

ఒప్పందంకోసం యింకా ప్రయత్నిస్తున్నామని అమెరికా, రష్యాల ప్రతినిధులు వ్రాతమూలకంగా తెలిపారు.

గ్రోమికో రూపొందించిన పథకం ప్రాతిపదికగా అంగీకారం కుదుర్చుకోవడానికి అమెరికా తిరస్కరించిన కారణంగా ఇంకా ఒక అంగీకారానికి రావడం జరగలేదని రష్యా ప్రతినిధి పేర్కొన్నారు.

మూడుదశలలో నిరాయుధీకరణ కార్యక్రమము అమలు జరిగిన తర్వాతకూడా తమ వద్ద ఆయుధాలుండాలని అమెరికా కోరుతున్నదని ఆయన తెలియజేసారు.

అమెరికా అధ్యక్షుడు జాన్సన్, సైనికాధికారులు చేసిన ప్రకటనను బట్టి అమెరికా వద్ద 1000 అణుమిసైళ్లు, 1,100 బాంబర్లు ఉన్నాయన్నారు.

మానవ వినాశనానికి పనికివచ్చే ఆయుధాలు తమ వద్ద ఉంచుకోవాలని అమెరికా పట్టుబట్టడమే చర్చల విఫలతకు కారణమని స్పష్టం చేసారు.

"అణు ఛత్రం" అనేభావనను స్వార్థప్రాయంగా ఆమోదించితే ఈ మహాసభలో కొత్త అభివృద్ధిని సాధించటం సంభవమేనని చెప్పారు.

శాసనమండలికి సింగరాజు రామకృష్ణయ్య ఎన్నిక

హైదరాబాద్ జూలై 14

ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు శ్రీ సింగరాజు రామకృష్ణయ్యగారు తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి మొదటి లెక్కింపులోనే శాసన మండలికి ఎన్నికయారు 2137 ఓట్లలో వారికి 1074 ఓట్లు వచ్చాయి

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గంనుండి గెలుపొందిన శ్రీ విజయరామరాజుకు 1479 ఓట్లురాగా, ప్రత్యర్థులయిన శ్రీ సుబ్బారావుగారికి 1056 ఓట్లు వచ్చాయి

శ్రీ బి. వి. సుబ్బరాజు ఎన్నిక

హైదరాబాద్, జూలై 15

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గంనుండి శాసనమండలికి జరిగిన ఎన్నికలలో శ్రీ బి. వి సుబ్బరాజు ఎన్నికయినట్లు ఇక్కడికివార్త అందింది

వెర్రితలలు వేసిన పెట్టుబడిదారీ వ్యాపారధోరణి

డునేడిన్ (న్యూజిలెండ్), జూలై 14

"వక్షస్థలాన్ని అచ్ఛాదించని ఒక గౌను"ను ఒక యువతిచే ధరింపజేసి డునేడిన్ పట్టణంలోని ఒక విలాసవస్తువుల షాపు యజమాని అటువంటి గౌనుల అమ్మకం ప్రారంభించాడు వక్షస్థలాన్ని నగ్నంగా ప్రదర్శించే ఈ యువతిని చూసి డునేడిన్ యూనివర్సిటీకి చెందిన 14 మంది విద్యార్థులు ఆ షాపుఎదురుగా లాగులువిప్పి పారవేసి దిసమొలలతో ప్రదర్శన ప్రారంభించారు. నగ్న వక్షస్థలం ప్రదర్శించగాలేనిది నగ్న కటిస్థలాలను ప్రదర్శించితే అశ్లీలం వచ్చిందా? అని వారు ప్రశ్నించడం మొదలుపెట్టారు. వెర్రితలలు వేసిన ఈ పెట్టుబడిదారీ వ్యాపార ప్రదర్శన - పోటీప్రదర్శనలతో రోడ్డుపై రాకపోకలు ఆవేళకు పూర్తిగా నిలిచిపోయాయి.

పంజాబు రాష్ట్ర ప్రభుత్వానికిసహాయంగా కేంద్ర ఉన్నతాధికారి

దాస్ కమిషన్ నివేదిక పరిశీలించేందుకు

న్యూఢిల్లీ, జూలై 14

దాస్ కమీషన్ నివేదికను పరిశీలించి, ఇంకా తీసుకోవల్సిన చర్యలను నిర్ధారణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఒక సీనియర్ అధికారిని పంజాబు ప్రభుత్వానికి సహాయపడేందుకు పంపుతుందనివిశ్వసనీయంగా తెలుస్తున్నది.

మొన్న ఆదివారం పంజాబ్ ముఖ్యమంత్రి రాంకిషన్ కేంద్ర హోం మంత్రి నందాను కలుసుకొని చేసిన విజ్ఞప్తిదృష్ట్యా ఈ సహాయం అందచేసారు.

దాస్ కమిషన్ నివేదిక పరిశీలనను పూర్తి చేసి తగు చర్యలు తీసుకోవాలని నందా సూచించారు.

దాస్ కమిషన్ నివేదిక పరిశీలన విషయంలో ఆర్థిక మంత్రిత్వశాఖలోని కంపెనీలోని విభాగం సహాయకార్యదర్శి శ్రీ వి. యస్ మాన్‌దండా ఇప్పటికే ప్రాథమికమైన పనిని పూర్తిచేసినట్లు తెలుస్తున్నది. చండీగఢ్ నుండి ఇటీవలే వచ్చి ఆయన నందాను కలుసుకున్నారు. తన పరిశీలన ఎంతవరకు వచ్చింది ఆయన నందాకు వివరించారు.

అతి మందకొడిగా సాగే రామగుండం విద్యుత్ కేంద్రం పని

1967 నాటికి గాని పూర్తికావని డాక్టర్ కె. యల్. రావు ప్రకటన

విజయవాడ జూలై 15

రామగుండం విద్యుచ్ఛక్తి కేంద్రం నిర్మాణం చాలా మందకొడిగా సాగుతున్నదని కేంద్ర విద్యుచ్ఛక్తి, నీటిపారుదల-శాఖ మంత్రి డాక్టర్ కె ఎల్, రావు నేడిక్కడ తెలియజేశారు. ఆదివారం రోజున రామగుండం ప్రాజెక్టును కొత్తగూడెం విద్యుచ్ఛక్తి కేంద్ర నిర్మాణాన్ని శ్రీ రావు సందర్శించి వచ్చారు. రామగుండం విద్యుత్ కేంద్రం 1967 నాటికి పని ప్రారంభించవచ్చునన్నారు.

అంతకన్నా ముందుగా పని పూర్తి చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు

62 మెగావాట్ల ఉత్పత్తి శక్తిగల యూనిట్ 1967 కు ముందుగా ఉత్పత్తి ప్రారంభించవచ్చునని చెప్పారు. కావలసినంత బొగ్గు, నీరు లభ్యమయ్యే అవకాశం వున్నందున 500 మెగావాట్ల శక్తిగల యూనిట్‌ను కూడా నెలకొల్పే అవకాశం వున్నదని సూచించారు.

120 మెగావాట్ల ఉత్పత్తి శక్తిగల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి యూనిట్ నెలకొల్పుతున్న కొత్తగూడెం కేంద్రంలో, అంతే శక్తిగల మరో యూనిట్ నెలకొల్పుటకు అనుమతి లభించిందని తెలియచేశారు.

కొత్తగూడెం వద్ద 10 లక్షల కిలో వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయగల కేంద్రం నిర్మాణానికి కావలసిన వనరులు పుష్కలంగా వున్నాయని తెలిపారు.

విద్యుచ్ఛక్తిశాఖ కార్మికుల కరువుభత్యం

అధికార-అనధికార సంయుక్త సమావేశం

హైదరాబాద్, జూలై 15

విద్యుచ్ఛక్తిశాఖ కార్మికులకు అధికధరల అలవెన్సు, రు 5 ల తాత్కాలిక వేతనం పెంపుదల వర్తింపు తదితర సమస్యలను చర్చించడానికి అధికారుల అనధికారుల సంయుక్త సమావేశం ఈ నెల 19 వ తేదీన జరుగుతుందని ఏ. డబ్ల్యు. శాఖామంత్రి శ్రీ ఏ. సి సుబ్బారెడ్డి నేడు శాసనసభలో తెలియచేశారు.

తూ. పాకిస్తాన్‌లో 50 వేలమంది జూట్ కార్మికులసమ్మె

ఢాకా, జూలై 15

తూర్పు పాకిస్తాన్‌లోని నారాయణ్‌గంజ్ ప్రాంతానికి చెందిన 6 జూట్ మిల్లులలోని 50 వేలమందికి పైగా గల కార్మికులు నేటి ఉదయం నుండి సమ్మెప్రారంభించినట్లు ఇక్కడికి వార్త అందింది.

మేనేజిమెంటు ప్రతినిధులకు, యూనియన్ ప్రతినిధులకు రాజీకై జరిగిన సంప్రతింపులు విఫలమైనందున కార్మికులు గత్యంతరం లేక, సమ్మెకు పూనుకున్నారు

సమ్మెకు తూర్పు పాకిస్తాన్ జూట్ కార్మిక యూనియన్ల ఫెడరేషన్ నాయకత్వం వహించుచున్నది. కార్మికులు 8 కోర్కెలతో ఒక పత్రాన్ని, సమ్మె నోటీసుతో పాటు యజమానులకు అందజేశారు.

స్వతంత్ర కాశ్మీర్ ప్రతిపాదనపై అయూబ్‌ఖాన్ వ్యాఖ్య

లండన్, జూలై 14

స్వతంత్ర కాశ్మీర్ ప్రతిపాదనను పాకిస్తాన్ అంగీకరించుచున్నదా? లేదా? అనే విషయాల్లోకి ఇప్పుడప్పుడే పోదలచుకోలేదని పాకిస్తాన్ అధ్యక్షుడు శ్రీ అయూబ్‌ఖాన్ నేడిక్కడ అన్నారు.

సింహళానికి పాక్ నిరసన

కాశ్మీర్ భారతఅంతర్భాగమనే గేయప్రసారానికి

కరాచీ, జూలై 14

పాకిస్తాన్ నిరసనను పురస్కరించుకొని కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగమని వర్ణించే ఒక పాట రికార్డు ప్రసారాన్ని సింహళ రేడియో కేంద్రం నిలిపివేసింది.

ఈ పాట 'గోవా' అన్న భారతీయ చిత్రంలోనిదని స్థానికవార్తా పత్రికలు నేడు తెలియజేశాయి. వ్యాపారరీత్యా మాత్రమే సింహళ రేడియో కేంద్రం ఈ పాటను ప్రసారం చేస్తున్నట్లు తెలుస్తున్నదనీ, పాక్‌ప్రభుత్వం నిరసన తెలియజేయడంతో ఈ ప్రసారాన్ని నిలిపివేశారనీ ఒక పత్రిక రాసింది.

కృశ్చేవ్ కుట్రదారుని మావో నిందాప్రచారం

చైనా విడివాద సిద్ధాంతాల పరాకాష్టగా సుదీర్ఘ వ్యాసం

పెకింగ్ జూలై 14

కృశ్చేవ్‌లాంటి కుట్రదారులను, పదవీవ్యామోహపరులను జాగ్రత్తగా ఒక కంట కనిపెట్టవలసిందిగాను, చైనా ప్రభుత్వ స్థాయిలోను, పార్టీ నాయకత్వ స్థాయిలోను వారు అధికారాన్ని చేజిక్కించుకోవటాన్ని నిరోధించవలసిందిగా చైనా కమ్యూనిస్టుపార్టీ అధ్యక్షుడు మావో-సే-టుంగ్ నేడు తన అనుయాయులకు సలహా యిచ్చారు.

చైనా కమ్యూనిజం భవిష్యత్తుపైన ఆయన [illegible] ఆందోళన, చైనాలో 'పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణ' జరగకుండా ఎలా నిరోధించాలనే సమస్యపైన ఆయన సిద్ధాంతాల సంగ్రహపాఠాన్ని నేడు బృహత్ వ్యాస రూపంగా ప్రచురించారు.

కృశ్చేవ్ 'కపట కమ్యూనిజాన్ని' తన వ్యాసంలో మావో తూర్పారబట్టారట.

చైనాలో సోషలిస్టు, పెట్టుబడిదారీ వర్గాల మధ్య పోరాటం అనేక శతాబ్దాల పాటు జరగవచ్చునని కూడా మావో జోస్యం చెప్పారు

మార్క్సిజమ్ - లెనినిజమ్‌ను పరిపుష్టం చేస్తూ, అభివృద్ధి చేస్తూ మావో ప్రవచించిన సిద్ధాంతాలు సకల కమ్యూనిస్టు దేశాలకు శిరోధార్యాలని ఆ వ్యాసం పేర్కొన్నది.

చైనాలో గత రెండు సంవత్సరాలలో సంభవించిన ప్రధాన రాజకీయ పరిణామాలు ముఖ్యంగా 'వర్గ పోరాట తీవ్రత', 'వర్గ చైతన్యం'పైన ఈ వ్యాసంలో ఎక్కువభాగం కేంద్రీకరించబడింది.

జీవిత పరిస్థితులు మెరుగవటంతోపాటు వర్గ పోరాటం తీవ్రతరం అవుతుందనే సూత్రీకరణ ఇందులో గర్భితమయి ఉన్నట్టు పరిశీలకులు పేర్కొంటున్నారు.

కమ్యూనిస్టు భావన ప్రకారం చైనాసమాజం 'పూర్తి పరిశుద్ధమయినది' కాదు అని ఆ వ్యాసంలో ఒకభాగం స్పష్టంచేస్తున్నది. అయితే ఈ భాగంమాత్రం మావో వ్రాసింది కాదు.

చైనా సైన్యాన్ని, భద్రతా దళాలను ఖచ్చితంగా పార్టీ కంట్రోలు క్రింద ఉండాలనేది మావో నొక్కిచెప్పిన విషయాలలో మరొకటని ఆ వ్యాసంతెలిపింది.

"వర్గాలు, వర్గపోరాటం ఇంక ముందుకూడ ఉంటాయి. పదవీచ్యుతులయిన అభివృద్ధి నిరోధక వర్గాలు తిరిగి అధికారాన్ని కైవసం చేసుకొనేందుకు కుట్రలు సాగిస్తాయి పాత, కొత్త బూర్జువా శక్తులు ఇంకా తమ భావనా జగత్తులో విహరిస్తూనే ఉన్నాయి మోసకారులు, లంచగొండ్లు, అవినీతిపరులదాదులను ఇంకా మనం ఎదుర్కొంటూనే ఉన్నాం."

"కొన్ని ప్రాథమిక కమిటీలలో అధమ స్థాయికి దిగజారిపోయిన ఉదంతాలు కూడ ఉన్నాయి. ఈ అధమాధమ స్థాయికి దిగజారిన వారు, ఉన్నత కమిటీలలో తమను సంరక్షించే వారిని ఏజెంట్లను పొందేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తారు. అటువంటి పరిణామాలపై మనం కడు జాగ్రత్త వహించాలి. ఏవిధంగా నిఘా సడలరాదు' అని ఆ వ్యాసం పేర్కొన్నది.

ఈ మధ్యనే జరిగిన కమ్యూనిస్టు యువజన సంఘం మహాసభలో మావో చేసిన ప్రసంగమే, ఈ వ్యాసం అయివుంటుందని ఊహ. వ్యాసంలో ఎక్కువభాగాలు దానినే సూచిస్తున్నవని పరిశీలకులు అంటున్నారు. 1963 మేలో మావో వ్రాసిన గ్రంథంలో కొన్ని భాగాలు ఈ వ్యాసంలో ఉన్నాయని కూడ వారంటున్నారు. అయితే 1963 లో మావో వ్రాసిన గ్రంథాన్ని ఇంతకుముందు ప్రకటించటంగాని, లేదా పేర్కొనటంగాని జరగలేదు.

యువజన మహాసభలో పార్టీప్రధాన కార్యదర్శి టెంగ్ సియావోపింగ్ చేసిన ప్రసంగంలో ఒక భాగాన్ని అధికారయుతంగా ఈ మధ్యనే ప్రచురించారు.

ఆం. ప్రదేశ్ ప్రధాన న్యాయమూర్తి

పదవీ వ్యవధిని పెంచినందుకు హైకోర్టులో రిట్

హైదరాబాద్, జూలై 15

ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ పి. చంద్రారెడ్డిగారి పదవీ వ్యవధిని 60 సంవత్సరాల వయస్సు పైగా పొడిగించడాన్నీ, రాజ్యాంగ చట్టం 15 వ సవరణ అమలుజరగడాన్నీ సవాల్‌చేస్తూ శ్రీ సూర్యప్రకాశం అనే న్యాయవాది ఒకరు పెట్టుకొన్న రిట్ దరఖాస్తును ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు నిన్న దాఖల్ చేసుకొన్నది.

అరవై సంవత్సరాలు నిండిన తరువాత జూలై మొదటి తేదీనుండి శ్రీ చంద్రారెడ్డి తమ పదవిలో వుండటం క్రమవిరుద్ధమని, ఆయన తమ పిటీషన్‌లో వాదించారు.

ఈ సందర్భంగా పదవీ విరమణ వయస్సు పెంచుతూ చేసిన రాజ్యాంగ సవరణ చెల్లదని గూడా ఆయన న్యాయస్థానానికి నివేదించారు రాజ్యాంగ చట్టంలో 368 నిబంధనకిది విరుద్ధమని చెప్పారు.

కాశ్మీరులో అరెస్టులు

జమ్మూ, జూలై 15

పాక్ ఆక్రమిత కాశ్మీర్ సరిహద్దులో వున్న మెంధార్ గ్రామంలో పాకిస్తాన్ ఏజంట్లనే అనుమానంతో నిన్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు వారివద్ద కొన్ని ప్రేలుడు వస్తువులుకూడా పట్టుబడ్డవి.

వీరిని సరిహద్దు కాపలా సైనికులు పట్టుకొన్నారు. ఆ తరువాత సమీపంలో ఒక పోలీసు స్టేషన్‌లో అప్పగించారు.

సరిహద్దులో పాక్ కాల్పులు కొనసాగింపు

జమ్మూ, జూలై 14

భారత-పాక్ సరిహద్దుల్లో పాకిస్తాన్ సైనికులు యుద్ధ విరమణ రేఖను ఉల్లంఘించి భారతీయ గస్తీ కేంద్రాలపైనా, భారతీయ పౌరులపైనా కాల్పులు కొనసాగిస్తూనే ఉన్నారని నేడిక్కడికి అందిన అధికార వర్తమానం బట్టి తెలుస్తూ వుంది.

ఆదివారం నాడు సైనిక దుస్తుల్లో ఉన్న సాయుధులైన పాకిస్తానీయుల దండు ఒకటి పశువులను ఎత్తుకుపోయే నిమిత్తం భారతీయ భూభాగంలోని దాలా గ్రామంలోకి అక్రమంగా ప్రవేశించింది. వీరిని నిరోధించడానికి భారతీయ గస్తీదళం కాల్పులు ప్రారంభించ వలసివచ్చింది. దీనితో పాక్ సైనికులు ఈ దుండగులు తప్పించుకొని పోవడానికి వీలు కల్పించేనిమిత్తం మధ్యరకం మరతుపాకులతో భారతీయ గస్తీదళంపై కాల్పులు కొనసాగించారు. ఈ కాల్పుల్లో నష్టానికి సంబంధించి ఎట్టి వార్తలూ అందలేదు.

ఛాంబా ప్రాంతం, నైరుతిభాగం, వాయవ్య భాగంనుండి గూడా పాకిస్తాన్ సైనికులు కాల్పులు సాగించారు. ఈ ఉభయ ప్రాంతాలలో ఈ నెల 12 వ తేదీనుండి పాక్ సైనికులు కాల్పులు కొనసాగిస్తూనే ఉన్నారు. వీరిపై భారత గస్తీ దళం తిరిగి కాల్పులు సాగించింది ఈ కాల్పుల్లో కూడా నష్టానికి సంబంధించి ఎట్టి వార్తలు లేవు.

జమ్మూనుండి 35మైళ్ళ దూరంలో కాశ్మీర్ ఖుర్ కంగాంలో కూడా పాక్ సైనికులు మధ్యరకం మరతుపాకులతో కాల్పులు సాగించినట్లు మరొక వర్తమానం బట్టి తెలుస్తుంది. దీని ప్రతిగా భారతీయ గస్తీ దళం కాల్పులు సాగించింది. ఈకాల్పుల్లో ఒక పాకిస్తానీయుడు మృతి చెందాడు ఇతరులు పారిపోయారు

పూంచ్‌లోని మెంధార్ ప్రాంతంలోనూ కొవద ప్రాంతములోనూ ఈ నెల 10తేదీ నుండి 13వతేదీ వరకూ పాక్ సైనికులు నిర్విరామంగా కాల్పులు సాగించారు.

ఈ సంఘటన లన్నింటి పైనా ఐరాస పరిశీలక బృందానికి భారతప్రభుత్వం నిరసన పత్రాలను అందజేసింది.

కాశ్మీర్ సరిహద్దు పౌరగస్తీ దళాలు

గెజిట్ ప్రకటన

జమ్మూ, జూలై 15

సరిహద్దు కాపలా యేర్పాట్లకోసం కాశ్మీర్ ప్రభుత్వం యీమధ్య పొండా తహశీల్ ప్రాంతంలోని 47 గ్రామాలలో పౌరగస్తీ దళాలను యేర్పాటు చేసింది ఈ దళాలు రాత్రి పూటగూడా సరిహద్దు సమీప ప్రాంతాలలో గస్తీచర్యలు జరుపుతుంటాయి.

ఈ గస్తీదళాలకు అధ్వర్యం వహించే నిర్వాహక కమిటీల సభ్యుల పేర్లను నిన్న రాష్ట్రప్రభుత్వ గెజెట్‌లో ప్రకటించింది.

వాతావరణం

మద్రాసు, జూలై 15

17 వ తేదివరకు తేలిక వర్షాలు మొదలు ఒక మోస్తరు వర్షాలవరకు ఆంధ్రలోని అన్ని జిల్లాల్లోను పడవచ్చును.

బందరులో రిక్షాడ్రైవర్ల సమ్మె

మచిలీపట్నం జూలై 14

బందరులో నేడు రిక్షా డ్రైవర్లందరూ పూర్తిగా సమ్మె చేశారు రిక్షాకురోజుకు ప్రస్తుతం రు 2 25 నపై బాడుగ యజమానికి చెల్లించ వలసి వుంది. ఈ బాడుగను రు1-50 నపైలకు తగ్గించవలసినదిగా కోరుతూ, తమ కోర్కెను సాధించేందుకై రిక్షా డ్రైవర్లు సమ్మె చేశారు

రిక్షా డ్రైవర్ల సహకారసంఘానికి చెందిన 50 రిక్షాలుకూడా ఇతర రిక్షాడ్రైవర్ల కోర్కెను బలపరుస్తూ సమ్మెలో పాల్గొన్నాయి.

హిందుస్థాన్ ఏర్‌క్రాఫ్ట్ లిమిటెడ్ కంపెనీని, ఏరోనాటిక్స్ ఇండియా అనే సంస్థతో విలీనం చేస్తున్నారు.

సదాచార సమితి దిగువశాఖలు

కేంద్రం సమితి అనుమతి వుండి తీరాలని ఆదేశం

న్యూఢిల్లీ, జూలై 15

రాష్ట్ర స్థాయిలోగాని, మరో స్థాయిలోగాని సదాచార సమితి శాఖలు యేర్పాటు చేయాలనుకుంటే, అందుకు కేంద్ర సమితి అనుమతి విధిగా వుండి తీరాలి.

తమ యీ నిర్ణయం సదాచార సమితి కేంద్ర కార్యాలయం అన్ని రాష్ట్రాలకూ యీ వారం తెలియజేసింది.

గుంటూరు డివిజన్ ఆర్. టి. సి. పనివారి సమ్మె నిర్ణయం

గుంటూరు జూలై 14

తమ హక్కులకై సమ్మె చేయడానికి గుంటూరు డివిజన్ ఆర్ టి. సి. పనివారిలో అత్యధిక సంఖ్యాకులు సంసిద్ధతను ప్రకటించారు.

కరువుభత్యం 15 రూపాయలు శాశ్వతంగా పెంచాలనీ, ప్రయాణీకులు టిక్కెట్టుకొని బస్ ఎక్కి తమ బాధ్యతను నిర్వహించవలసిందిగానూ, ప్రమాదాలకు సంబంధించిన ఒప్పందాన్ని డ్రైవర్లకు అనుకూలంగా మార్చవలెననీ మెకానికల్ స్టాఫ్, వాచ్‌మన్‌లకు మూడు జతల యూనిఫారములు ఇవ్వవలెననీ, వాషింగ్ ఎలవెన్సు, చెప్పులూ ఇవ్వవలెననీ, క్యాజువల్ కార్మిక విధానాన్ని రద్దు చేయాలనీ, బస్సులను సరయిన కండిషన్‌లో వుంచాలనీ, సీనియారిటీనిబట్టి ప్రమోషన్లు ఇవ్వాలని మున్నగు కోర్కెలపై రోడ్‌ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌తో ఏ. పి. యస్. ఆర్. టి. సి. ఎంప్లాయీస్ యూనియన్ జరిపిన సంప్రతింపులువిఫలమయిన కారణంగా ఈ నెల 8 వ తేదీ నుండి 13 వతేదీ వరకు గుంటూరు డివిజన్‌లో సమ్మె బ్యాలెటు తీసుకోడానికి యూనియన్ ఇటీవల నిర్ణయించింది.

సమ్మెకు అనుకూలంగా అధిక సంఖ్యాకుల ఓటు

డివిజన్‌లో మొత్తం 19 వందల మంది కార్మికులలో 1586 మంది ఈసమ్మె బ్యాలెటులో పాల్గొన్నారు. కొందరు సెలవు మీద వుండటంవల్ల పాల్గొనలేక పోయారు.

1472 మంది సమ్మెకు అనుకూలంగా ఓటు చేశారు.

డిపోలవారి వివరాలు :—

గుంటూరు డిపోలో 498 మంది సమ్మె బ్యాలెట్‌లో పాల్గొన్నారు. సమ్మెకు అనుకూలంగా 470 మంది ఓటు చేశారు.

తెనాలిలో 288 మంది పాల్గొనగా సమ్మెకు అనుకూలంగా 288 ఓట్లూ వచ్చాయి

రేపల్లెలో 92 మంది పాల్గొనగా 86 మంది అనుకూలంగా ఓటుచేశారు

బాపట్లలో 58 మంది పాల్గొనగా అందరూ అనుకూలంగా ఓటుచేశారు.

చీరాలలో 157 మంది పాల్గొనగా 154 మంది అనుకూలంగా వోటుచేశారు.

వినుకొండలో పాల్గొన్న 68 మందీ అనుకూలంగా ఓటు చేశారు.

ఒంగోలులో 112 మంది పాల్గొనగా 109 మంది అనుకూలంగా ఓటు చేశారు.

నర్సారావుపేటలో 200 మందికి 198 మంది అనుకూలంగా ఓటు చేశారు.

మాచెర్లలో 91 మందికి 88 మంది అనుకూలంగా ఓటు చేశారు.

డివిజనల్ ఆఫీసులలో కొన్ని కారణాంతరాలవల్ల బ్యాలెట్ జరుగలేదు.

డివిజన్ మొత్తంగా 77½ శాతం సమ్మె బ్యాలెట్‌లో పాల్గొన్నారు.

సమ్మెబ్యాలెట్‌లో పాల్గొన్నవారిలో 96 శాతం అనుకూలంగా ఓటుచేశారు.

కార్యదర్శి విజ్ఞప్తి

ఈ సందర్భంగా సమ్మెలో పాల్గొన్నవారికి బ్రాంచి యూనియన్ తరపున కార్యదర్శి శ్రీ సుధాకరరావు అభివందనలు తెలియజేస్తూ సమ్మెకు సంసిద్ధులు కావలసిందిగాను, 16నుండి జరుగబోవు యూనియన్ గుర్తింపు వెరిఫికేషన్‌లో కార్మికులంతా పాల్గొని ఎంప్లాయీస్ యూనియన్‌కే ప్రాతినిధ్యం ఇచ్చేవిధంగా తీర్పు ఇవ్వవలసిందిగానూ విజ్ఞప్తి చేశారు. (వి.ని.)

సి. డి. ఎల్. ఎఫ్. బదులు శాసనసభ కమ్యూనిస్టు పార్టీగా పేరుమార్పు

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి నిర్ణయం

హైదరాబాద్ జూలై 15

ఇంతవరకు కమ్యూనిస్టు ప్రజాతంత్ర శాసనసభా పక్షంగా (సి. డి యల్. ఎఫ్) వ్యవహరించుతున్న పేరును ఇక ముందు శాసన సభ కమ్యూనిస్టు పార్టీగా వ్యవహరించాలని ఇక్కడ జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టుసమితి తీర్మానించింది.

శాసనసభలో కమ్యూనిస్టు సభ్యులు 29 మంది ఉన్నారు, ఇండిపెండెంటు సభ్యుడు శ్రీ వై. పాపిరెడ్డి కూడా కమ్యూనిస్టుపార్టీలో చేరడానికి అంగీకరించడంతో కమ్యూనిస్టు సభ్యుల సంఖ్య 30 అయినది.

కమ్యూనిస్టేతర సభ్యులు ఇక ఎవరూ లేనందున పూర్తిగా కమ్యూనిస్టు పక్షంగానే వ్యవహరించాలని శాసనసభ కమ్యూనిస్టు పార్టీ కార్యవర్గం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని నేడు ప్రదేశ్ కౌన్సిల్ ఆమోదించింది.

అందుచేత ఇక ముందు శాసనసభలో సి. డి. ఎల్. ఎఫ్ అంటూ ఉండదు. శాసనసభ కమ్యూనిస్టుపార్టీ ప్రతిపక్షపార్టీగా ఉంటుంది.

విశాలాంధ్ర

నల్లేరుపై బండి!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసెంబ్లీలో పంచాయతీల, జిల్లా పరిషత్తుల సవరణబిల్లును ప్రవేశపెట్టి ప్రతిపక్షాల అభ్యంతరాలను ఖాతరు చేయకుండా పాలకపార్టీకున్న సంఖ్యాబలంతో త్వరితగతిని ఆమోదింపచేసుకుంది.

బ్లాకుల పునర్విభజన చెల్లనేరదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు యిచ్చింది. చట్టప్రకారం తనకులేని అధికారాన్ని వినియోగించి, పంచాయతీసమితులను పునర్విభజించినందులకు ప్రభుత్వాన్ని విమర్శించింది. హైకోర్టుతీర్పుదృష్ట్యా పంచాయతీసమితులను పునర్విభజించే హక్కును సంపాదించేందుకు మంత్రివర్గం ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది కాని పునర్విభజన సందర్భంలో ప్రజాభిప్రాయాన్ని గాని, ప్రతిపక్షాల సలహాలనుగాని స్వీకరించకుండాను, చట్టవిరుద్ధంగానూ తొందరపాటుగా వ్యవహరించినట్లే సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదముద్రను వేయించుకోవడంలో కూడ ప్రభుత్వం అదే నిర్లక్ష్య వైఖరిని దుందుడుకుతనాన్ని ప్రదర్శించింది.

ఈ సవరణ బిల్లుపై అసెంబ్లీలో జరిగిన చర్చలు, అధికార పక్షానికి ప్రతిపక్షాలకు మధ్య జరిగిన వాగ్వాదాలు పరిశీలించితే మంత్రుల అసహనం, తొందరపాటు స్పష్టంగా కన్పించుతుంది. హైకోర్టు తీర్పు కాపీలను అసెంబ్లీ సభ్యులకు అందచేస్తే, న్యాయమూర్తుల అభిప్రాయాలను అవగాహన చేసుకొని సవరణ బిల్లుపై చర్చల్లో పాల్గొనేందుకు సభ్యులకు వీలుగా వుంటుందని ప్రతిపక్షాల నాయకులు కోరారు కాని సహేతుకమైన ఈ కోర్కెను కూడా మంత్రివర్యులు అంగీకరించ లేదు ప్రతిపక్షాలు ప్రతిపాదించిన అన్ని సవరణలను తమకున్న సంఖ్యాబలంతో ప్రభుత్వ పక్షం ఓడించివేసింది. "నల్లేరుపై బండి తోలిన చందం"గా సవరణ బిల్లును ఎలాంటి మార్పు లేకుండా అసెంబ్లీ చేత ఆమోదింప చేసుకుంది.

అందుచేతనే ప్రతిపక్షాలకు చెందిన సభ్యులంతా అసమ్మతి తెలుపుతూ అసెంబ్లీనుండి వాకౌట్ చేశారు.

ప్రజాస్వామ్యవాదులమనీ, ప్రజాభిప్రాయానికి విలువ యిస్తామనీ, కాంగ్రెసుమంత్రులు నిత్యం వల్లించుతుంటారు. కాని ఆచరణలోమాత్రం 'వారికి తోచదు ఇతరులు చెబితే వినిపించుకోరనే' ధోరణితో వారు వ్యవహరింతుంటారు.

పంచాయితీ సమితుల సవరణ బిల్లుకు అసెంబ్లీ సత్వరామోదం పొందడంలో చూపిన ఆతురత, ప్రతిపక్షాల సూచనలకు సవరణలను నిర్లక్ష్యం చేయడంలో ప్రదర్శించిన తొందరకూడా పాలకవర్గ అహంకారానికి ప్రతిబింబాలవంటివి. అధికారం లేకుండా పునర్విభజన చేసి, చట్ట విరుద్ధంగా వ్యవహరించి, హైకోర్టు విమర్శకు గురైనందుకు వినమ్రతగానీ పశ్చాత్తాపంగాని మంత్రివర్యులలో కన్పించదు

సమితుల ఎన్నికలలో జరిగిన అవకతవకలు – ముఠా క్యాంపులలో పంచాయితీ అధ్యక్షులను బందీలుగా వుంచడం, ఒక్కొక ఓటు అనేకవేలు ధనమిచ్చి కొని వేయడంవంటి – జుగుప్సాకరమైన పనులు జరిగాయి. అలాంటి దౌర్భాగ్య సంఘటనలు పునరావృతం గాకుండా అరికట్టేందుకు తమ ప్రభుత్వం ఏమి చేయబోతూందో మంత్రివర్గం తరపున ఎవరూ సెలవివ్వలేదు. ఒకవేళ అలాంటివన్నీ సర్వసాధారణమైన నిత్యవ్యవహారాలుగానే మంత్రివర్యులు భావించారేమో తెలియదు.

ప్రభుత్వాధికారంలో కూర్చున్నవారు ఇలాంటి వైఖరిని అనుసరించినంత కాలం పంచాయతీరాజ్‌లో ప్రజానీకం భాగస్వాములు కావాలనే ఆదర్శం అమలు జరుగదు పంచాయతీ సమితులు, పరిషత్తులు కూడా ప్రజా రాజ్యానికి చిహ్నాలుగా అభివృద్ధి చెందవు ధనికవర్గాల చెలగాటానికి, ముఠాకీచులాటలకు కేవలం వేదికలుగామాత్రమేవుండిపోతాయి

ఆహారరంగంలో గడ్డుదశ తప్పదట!

అయినా రాజకీయపార్టీలు నిగ్రహం చూపాలని శ్రీమన్నారాయణ హితవు

చండీఘర్, జూలై 15

పెద్దగా ఆందోళన పడాల్సిన అవసరం అంతగా లేకపోయినా, మున్ముందు కొలది మాసాలపాటు, ఆహార ధాన్యాల ధరల స్థితి చాలా గడ్డుగావుండి తీరుతుందని ప్రణాళికా సంఘ సభ్యులు శ్రీ శ్రీమన్నారాయణ నిన్న యిక్కడ చెప్పారు.

ఈ పరిస్థితిని అధిగమించడానికి కేంద్రం, రాష్ట్రప్రభుత్వాలుగూడా తమ యథాశక్తి కృషిచేస్తూనే వున్నవి. అందుకు ఈ గడ్డు పరిస్థితిని తమ సంకుచిత పార్టీప్రయోజనాలకు వినియోగించుకోకుండా దేశంలోని రాజకీయ పార్టీలు నిగ్రహం చూపాలని ఆయన సలహా యిచ్చారు.

పూర్తి స్వేచ్ఛావ్యాపారాన్నిగానీ, సమగ్రమైన కంట్రోళ్లు, రేషనింగ్ పద్ధతులనుగాని ప్రవేశపెట్టకుండా, మధ్యేమార్గ మనుసరించడమే ప్రభుత్వ ఆహార విధానమని ఆయన నిర్వచించారు.

ఆహారరంగంలో పూర్తి స్వేచ్ఛా వ్యాపారాన్ని అనుమతించి, కొద్దిమంది స్వార్థపరుల్ని ప్రజల ప్రాణాలతో చెలగాట మాడటానికి అనుమతించాలనేది మన అభిమతం కాదు. మొత్తం వ్యాపారాన్నంతటినీ ఆకట్టుకొని, సాధారణ వ్యాపార పద్ధతులను రూపుమాపి, సర్వత్రా ప్రభుత్వోద్యోగుల నిరంకుశ పరిపాలన ప్రవేశపెట్టాలనేది గూడా ప్రభుత్వ విధానం కాదని ఆయన చెప్పుకున్నారు.

కాందిశీకులపై పోలీసు కాల్పులు న్యాయరహితం

శిబినాథ్ బెనర్జీ ప్రకటన

రాయపూర్ జూలై 14

తూర్పు పాకిస్తాన్ నుండి భారత దేశానికి వచ్చిన కాందిశీకులపై ఒరిస్సా రాష్ట్రంలో తెరువని రైల్వేస్టేషన్‌కో పోలీసులు కాల్పులు జరపడం అన్యాయమనీ ఎలాంటి కవ్వింపు సంఘటన లేకుండానే ఈకాల్పులు జరిగాయనీ యదార్థ విషయాలను తెలుసుకొనే నిమిత్తం నియమించబడిన ఉపసంఘం నిర్ణయానికి వచ్చిందని ఈ ఉపసంఘం కన్వీనర్ శిబినాథ్ బెనర్జీ నేడిక్కడ చెప్పారు

ఈ రైల్వే స్టేషన్‌లో మే నెల 19 వ తేదీన కాందిశీకులపై పోలీసులు కాల్పులు జరిపిన విషయం పాఠకులకు విదితమే. దాదాపు 13 వందల మంది కాందిశీకులు తమ శిబిరాలను ఖాళీచేసి పశ్చిమబెంగాల్ వెళ్ళేనిమిత్తం రైల్వేస్టేషన్‌లో బైఠాయించి ఉండగా వీరిపై పోలీసులు కాల్పులు జరిపారు. దాని ఫలితంగా 5 గురు మరణించారు మరో యెనిమిది మంది గాయపడ్డారు కాల్పుల విషయమై నిజానిజాలేమిటో తెలుసుకొనేందుకు పశ్చిమబెంగాల్ పౌరహక్కుల కమిటీ ఈ ఉపసంఘాన్ని నియమించింది.

శ్రీ బెనర్జీనేడిక్కడ పత్రికలవారితో మాట్లాడుతూ ఈకాల్పులు న్యాయవిచారణ జరపడానికి తగిన విషయమని, ఈలాంటి విచారణకు ప్రభుత్వం నిరాకరించడం విచారకరమనీ అన్నారు.

కాందిశీకులు పోలీసులపై తిరగబడి రాళ్ళు విసరడం, ఆయుధాలతో ఎదుర్కొన్నమీదటనే పోలీసులు కాల్పులు జరిపారని ఈ సందర్భంలో 12 మంది పోలీసులు గాయపడ్డారని అధికారులు లోగడ ప్రకటించిన విషయం పాఠకులకు విదితమే.

రైల్వేల మంత్రి శ్రీ యస్. కె. పాటిల్ యీ 23 వ తేదీన అమెరికా పర్యటనకు వెళ్తున్నారు.

ఆఫ్రికా కంతటికీ ఒకే ఒక ప్రభుత్వం ఉండాలనే ప్రతిపాదన

కైరో, జూలై 14

ఆఫ్రికా కంతటికి ఒకే ఒక ప్రభుత్వం ఏర్పడాలన్న ఘనా అధ్యక్షుడు న్క్రుమా ప్రతిపాదనను ఆఫ్రికా సమైక్య సంస్థ విదేశాంగ మంత్రుల రాజకీయ కమిటీ, నేటి సాయంకాలం అసంపూర్తిగా చర్చించింది

ఈ సమస్యపై విభిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి సంభాషణలు ఇంకా కొనసాగుతాయి. దక్షిణాఫ్రికాపై ఆర్థిక ఆంక్షలు విధించటానికి జరుప తీయనున్న చర్యలనుకూడా ఈ కమిటీ రేపు చర్చిస్తుంది.

భారతదేశ సామ్రాజ్యవ్యతిరేక సంప్రదాయాలకు తలవంపు

కామన్వెల్తు సభలో శ్రీ టి. టి. కృష్ణమాచారి అవమానకర వైఖరి

ఆఫ్రికా జాతీయోద్యమాన్ని బలపర్చకుండా మూగనోము

కామన్వెల్తు సభలో భారతదేశం నాయకత్వపాత్ర వహించుతుందన్న తుది ఆశలన్నీ శ్రీ టి. టి. కృష్ణమాచారి లండన్‌లో చేసిన తొలి ప్రసంగంతో నాశనమయ్యాయి లండన్ చేరిన రెండు గంటలలో పత్రికా విలేకరులు చేసిన విందులో శ్రీ కృష్ణమాచారి చేసిన ప్రసంగం వలన శక్తివంతమైన ఆఫ్రికా జాతీయోద్యమ శక్తులనుండి భారతదేశం పూర్తిగా వేరుపడిపోయింది. కామన్వెల్తు సమావేశంలో ఆఫ్రికా దేశాలు ఒక పెద్ద శక్తిగా తయారైనట్లు ఇప్పటికే తేలిపోయింది.

దక్షిణ రొడీషియా దక్షిణాఫ్రికా బ్రిటిష్ గయానావంటి కీలక సమస్యలను కామన్వెల్తు సమావేశంలో చర్చించి తీరాలని సామ్రాజ్య వ్యతిరేక ఆఫ్రికా దేశాల ప్రతినిధులు స్పష్టం చేశారు.

భారత ప్రతినిధులకు ఈ విషయం పూర్తిగా తెలిసినప్పటికీ తమ ఆఫ్రికా సహచరులపట్ల సౌహార్దతను వెలిబుచ్చడంలో విఫలులయ్యారు. అంతేకాదు శ్రీ టి టి. కృష్ణమాచారి తన పత్రికా గోష్ఠిలో మరింత ముందుకుపోయారు.

దక్షిణ రొడీషియా గురించి టి. టి. కె మాట్లాడుతూ" ఈ దేశభవిష్యంపై బ్రిటన్ చేసిన ప్రకటనలు భారతదేశ విధానాలకు భిన్నంగా లేవు" అని అన్నారు

కాని వాస్తవం ఏమిటి? దక్షిణ రొడీషియాలో మైనారిటీ శ్వేతజాతి ప్రభుత్వం సాగిస్తున్న రాక్షస చర్యలకు బ్రిటిష్ ప్రభుత్వం మద్దతు యిస్తున్నందుకు యావత్తు సామ్రాజ్య వ్యతిరేక ప్రపంచమూ ఖండిస్తూంది. కామన్వెల్తు లోని 7 ఆఫ్రికా రాజ్యాలలో ప్రతీ ఒక్క రాజ్యమూ దక్షిణరొడీషియా సమస్యను చర్చనీయాంశాలలో ప్రప్రథమ స్థానంలో ఉండాలని ఇప్పటికే గట్టిగ పట్టుబడుతున్నాయి. ఎందుకంటే ఈ విషయంలో బ్రిటిష్ టోరీ ప్రభుత్వం అనుసరించుతున్న విధానంపూర్తిగా గర్హనీయంగా ఉంది.

దక్షిణ రొడీషియాలో ప్రత్యక్ష నరకానికి బ్రిటన్ బాధ్యత ఎంత ఉందో లండన్‌లోని ఘనా హైకమీషన్ కార్యాలయం ఒక కరపత్రాన్ని కూడా ప్రచురించింది.

కాని శ్రీమాన్ టి.టి.కె నిమ్మకు నీరెత్తినట్టు చల్లగా "టోరీ ప్రభుత్వ విధానం భారత ప్రభుత్వ విధానానికి భిన్నంగా ఉండదని" సెలవిచ్చారు,పైపెచ్చు "మేము ముందుగానే ఏటువంటిఅభిప్రాయాలను ఏర్పరచుకోబోము' అని కూడా సెలవిచ్చారు. ఆహా! ఈ మాట ఎంత గొప్పగా ఉంది. పీడితులకు, పీడకులకు మధ్య "తాటస్థ్యం' శ్రీ టి. టి. కెకు ఎంత మనోహరంగా ఉంది.

ఇది నూటికి నూటపాళ్ళు మూర్ఖత్వమైనా కావాలి, లేకదారుణమైన విద్రోహమైనాకావాలి!

"భారతదేశం తనంతతానుగా బ్రిటిష్ గయానా సమస్యనుగాని, దక్షిణాఫ్రికా సమస్యనుగాని చర్చించాలని కోరదు. కాని ఈ సమస్యలు చర్చకువస్తే భారతదేశం తన వైఖరి ఏమిటో వెల్లడిస్తుంది." (స్టేట్స్‌మన్ జూలై 8) అనికూడా శ్రీ టి. టి. కె అన్నారు.

భారతదేశం ఈ సమస్యను చర్చించాలని ఎందుకు అడగదూ? ఈ ప్రసక్తి తేడానికి అభ్యంతరం ఏమిటి? కామన్వెల్తులో చిరకాలంగాఉన్న సామ్రాజ్య వ్యతిరేక ఆసియా – ఆఫ్రికారాజ్యం భారతదేశం. అటువంటప్పుడు దక్షిణాఫ్రికాలో జాతివివక్షను గురించి, బ్రిటిష్ గయానాలో సాగుతున్న విభజించి పాలించే సామ్రాజ్యవాద కుటిల నీతిగురించి తాము ఏమీ మాట్లాడబోమని భారత ప్రతినిధులు సిగ్గులేకుండా ఎందుకు చెప్పాలి?

ఈ సలహా ఎవరిది? ఇది కేవలం "మట్టిబుర్ర" తనమా? లేక దానికంటే అధ్వాన్నమైనదా?

ఇక కాశ్మీర్ విషయంలోచూస్తే కాశ్మీర్ విలీనీకరణ తిరుగులేనిది, శాశ్వతమూ అని ఖండితంగా చెప్పడానికి బదులు కాశ్మీర్ సమస్యను భారత – పాకిస్తాన్ దేశాలు శాంతియుత సంప్రతింపుల ద్వారా పరిష్కరించుకుంటాయని శ్రీ టి టి కె అన్నారు.

కాశ్మీర్ విలీనీకరణ సమస్యపై ఎట్టి రాజీ సంప్రతింపులు ఎనికిరావని మనం అనుకుంటున్నాం

లావోస్ విషయంలో శ్రీ టి టి కె. 14 రాజ్యాల సభ గురించి ఏమీ మాట్లాడలేదు. అంతేకాదు అక్కడనుండి అమెరికా సైన్యాలను ఉపసంహరించాలన్న వూసే ఎత్తలేదు. ఆయన చెప్పిందల్లా, అమెరికా సామ్రాజ్యవాదులు చెప్పినట్టు పాథెట్‌లావో సైన్యాలను ఉపసంహరించాలన్నదే

శ్రీ టి. టి. కె. "స్వేచ్ఛా ప్రపంచం" ధోరణి, కమ్యూనిస్టు వ్యతిరేకవైఖరి చాలా అవమానకరమైన విషయాలు ఆయన దృష్టిలో అతి స్వచ్ఛమైన ప్రజాస్వామ్యం బ్రిటిష్ ప్రజాస్వామ్యం. ఆ ప్రజాస్వామ్యం తప్పక కొనసాగుతుందని బ్రిటిష్ దొరలకు ఈయన నమ్మ బలికాడు. 'కమ్యూనిస్టు ఉపద్రవం గురించి జాగ్రత్తగా ఉండాలంటూహెచ్చరించి భారతదేశం ఎన్నటికీ కమ్యూనిస్టు దేశం కాదంటూ ఆయన చిత్త వచ్చినట్లు మాట్లాడాడు ఆ విధంగా తనను విశ్వసించవలసిందని అన్నాడు. అందుకే ఈ పత్రికాగోష్ఠి విందుకు హాజరైన బ్రిటిష్ ఆర్థిక శాఖామంత్రి మాడ్లింగ్ శ్రీ టి. టి. కె. ను ఆకాశానికెత్తుతూ 'భారత దేశంలోనే కాక యావత్తు ఈయన కామన్వెల్తులోను ఒక "పురాణపురు తయారైనాడని అన్నారు (హిందూస్తాన్ టైమ్సు జూలై 8) శ్రీ టి టి. కె. పురాణాలు ఖుదు గాచాలా ఉన్నాయి. అందుహో దుర్వ్యాసన కొత్తపురాణాలు కూడా ఉన్నాయి.

ఒకరి వీపు ఒకరు తట్టుకొనడం కులాసాగా ఉండవచ్చు కాని శ్రీ టి టి. కృష్ణమాచారి లండన్‌లో చేసిన తొలిప్రసంగం భారతదేశానికి తీరని అపఖ్యాతిని తెచ్చేదిగా ఉంది. భారతదేశ సామ్రాజ్య వ్యతిరేక సంప్రదాయాలకు తలవంపులు తెచ్చేదిగా, కామన్వెల్తులో భారతదేశాన్ని అభాగతికి ఈడ్చేదిగా వుంది ఆసియా-ఆఫ్రికా దేశాల సమస్యలతో చొరవతీసుకోడానికి బదులు శ్రీ టి టి కె తనను, భారతదేశాన్నికూడా బ్రిటిషు టోరీ రథచక్రాలకు ముడివేస్తున్నారు.

ఈ అప్రతిష్ఠాకరమైన వైఖరికి స్వస్తి చెప్పి ఆ తరువాతనైనా తగు విధంగా సవరించడం అవసరం.

—న్యూఏజ్ జూలై 12

శ్రీ కామరాజ్ 62 వ జన్మదినోత్సవం

మధురై, జూలై 15

కాంగ్రెస్ అధ్యక్షుడు కామరాజ్ నాడార్ 62 వ జన్మదినోత్సవాన్ని నేడిక్కడజరుపుకున్నారు.

ఈ సందర్భంలో 10 వేలమంది స్కూలు పిల్లలు ఊరేగింపు జరిపారు, పిల్లలకు ఆయన మిఠాయిలు పంచారు.

ఈ సందర్భంలో 71,760 రూపాయలు చెక్కును "కామరాజ్ జన్మదినోత్సవ కమిటీ' ఆయనకు సమర్పించింది. ఆ చెక్కును రక్షణ నిధికి యిచ్చారు. తర్వాత ఆయన మద్రాసు వెళ్లారు.

కామన్వెల్తు విద్యా సభకు డి. యస్. రెడ్డి

హైదరాబాద్ జూలై 15

ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి. యస్. రెడ్డి కామన్వెల్తు దేశాల మూడో విద్యా మహాసభకు భారత ప్రతినిధిగా హాజరౌతున్నారు.

ఈ మహాసభ ఆగస్టు 21 మొదలు సెప్టెంబర్ 4 వ తేదీ వరకు కెనడా రాజధాని ఒట్టావాలో జరుగుతుంది.

అధ్యాపకుల శిక్షణ, పాఠ్యప్రణాళికలు, పాఠ్యగ్రంథాలు, వివిధ కామన్వెల్తు దేశాల మధ్య ఉపాధ్యాయుల మార్పిడి మొదలైన విద్యాసమస్యలను ఈ మహాసభలో చర్చిస్తారు.

కామన్వెల్తుదేశాలలోని వివిధ విశ్వవిద్యాలయాల డిగ్రీలను పరస్పరం గుర్తించాల్సిన అవసరాన్ని, అధ్యయన అంశాలలో సమైక్యత యేర్పాటుచేసుకోవలసిన అవసరాన్ని గురించి శ్రీ రెడ్డి యీ మహాసభలో ప్రత్యేక అంశంగా చర్చకు తేవాలనుకుంటున్నారు.

మహాసభానంతరం ఆయన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సుదేశాలలోని కొన్ని విశ్వవిద్యాలయాలను సందర్శించుతారు. ఉస్మానియాకు ఆయా విశ్వవిద్యాలయాలలో యీనాడున్న సంబంధాలను యితోధికంగా పెంపొందించేటందుకు ఆయన ప్రయత్నిస్తారు.

ప్రేలుడుప్రమాదంవల్ల నెల్లూరులో ఇద్దరి మృతి

నెల్లూరు, జూలై 14

నెల్లూరు ఆస్పత్రి రోడ్డులో డాక్టరు రఘునాథసింగ్ ఆస్పత్రివెనుక ఒక యింటిలో జూలై 8 న వుదయం ప్రేలుడు పదార్థాలమందు తయారుచేయు సందర్భంలో పెద్ద ప్రమాదం జరిగి యిద్దరు మృతిచెందారు.

ఆ ప్రమాదంలో చలంచర్ల నరసయ్య అను ఒక కార్మికుడు అక్కడికక్కడే చనిపోయాడు. గందళ్ళ చెంచయ్య అను మరియొక కార్మికుడు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చేర్చబడి 8న ఆస్పత్రిలో చనిపోయాడు శ్రీ ఖాదర్ మొహిద్దీన్ గారికి చెందిన రెండు పూరిళ్ళలో మందును రోకళ్ళతో దంచుతుండగా ప్రమాదంసంభవించినట్లు తెలుస్తున్నది. ఆ రెండు పూరిళ్లుకూడా పూర్తిగా కాలిపోయినవి. ఈ ప్రమాదానికి గురయిన కోటయ్య అను ఇంకొక వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చనిపోయిన ఇద్దరు కూలీలు కడు బీదవారు. ఆ మందుఫ్యాక్టరీలో వీరు చాలాకాలం నుండి రోజుకు రెండురూపాయల చొప్పున కూలీలుగా పనిచేస్తున్నారు ఈ ప్రమాదం విషయమై పోలీసులుకూడ దర్యాప్తు చేస్తున్నారు. (వి వి)

జనసంఘ్, డి. యం. కెలతో ఎన్నికల ఒడంబడికలు

తప్పనిసరి అని లోహియా ప్రకటన

లక్నో, జూలై 14

"తమిళనాడ్‌లో ద్రవిడమున్నేట్రకజగంతోనూ ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో జనసంఘంతోనూ ఇతర ప్రతిపక్షాలు పోటీ చేయరాదనే వాద బడకలు లేకుండా ఎన్నికలను గురించి మాట్లాడటంలో అర్థంలేదు." అని సోషలిస్టునాయకుడు లోహియా అన్నారు.

కొత్తగా ఏర్పడిన సంయుక్త సోషలిస్టు పార్టీ కార్యకలాపాలను తాను పరిశీలించుతున్నాననీ దాని పద్ధతులు 51 శాతంవరకైనా సరియైనవని తనకు తోచగానే ఆపార్టీలోతాను చేరగలననిడాక్టర్ లోహియా తెలియజేశారు.

నిన్న పత్రికా గోష్ఠిలో మాట్లాడుతూ ఆయన యింకా యిలా అన్నారు:

ప్రజావిప్లవాన్ని సాధించడానికి సరియైన సాధనం కావడానికి సంయుక్త సోషలిస్టుపార్టీ చాలా కష్టపడి పనిచేయవలసి వుంటుంది 51 శాతం వరకు అది మంచిదైతే దానిలో నేను చేరతాను. 49 శాతం వరకూ సిద్ధాంతాలను వదులుకోవడానికి నేను సంసిద్ధంగా వున్నాను.

కొన్ని సమస్యలపై సంయుక్త సోషలిస్టు పార్టీ వైఖరి నా సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వుంది. ఉదాహరణకు బెంగాల్, మహారాష్ట్రలలో భాష,కులం సమస్యలపైనా ఉద్దేశ్యాలను పొరపాటుగా అర్థం చేసుకున్నారు. ఉత్తర ప్రదేశ్, బీహారులలోని కొంతమంది పార్టీసభ్యులలో ఎంతకైనా తెగించి ఐక్యతను సాధించుకోవాలనే అభిప్రాయం వుంది.

హిందీ విషయంలో నాకెలాంటి విభేదమూ లేదు కాని ఇంగ్లీషు విషయంలో మాత్రం నాకు ఒకవిధానంఅంటూ ఒకటివుంది. కాని దురదృష్టవశాత్తూ కొంతమంది బెంగాల్, మహారాష్ట్ర సంయుక్త సోషలిస్టు పార్టీ (యస్ యస్ పి.) నాయకులు, ఇతరపార్టీల వారూ ఈ విభేదాన్ని అర్థంచేసుకోవడం లేదు. ఇంగ్లీషును వెంటనే తీసివేయాలని నేనంటున్నానంటే వారిపై హిందీని రుద్దాలని నాభావమని వారు అర్థంచేసుకొంటున్నారు ఇది నూటికి నూరుపాళ్ళు అబద్ధం. కావాలని సృష్టించబడుతున్న ఈ పొరపాటు అవగాహనను పోగొట్టడానికి ఏదో ఒకటి చేయవలసివుంది.

ఇక కులవ్యవస్థను గురించి మామూలు ప్రచారంద్వారా వేదావహసం సహపంక్తిభోజనంలాంటి చర్యలద్వారా కులాలను రూపుమాపగలమని నే ననుకోవడంలేదు. వెనుకబడిన కులాలవారికి ప్రత్యేక సౌకర్యాలను కలుగజేసి వారిని పెద్ద కులాల స్థాయికి తీసుకొని రాగలిగినప్పుడే కులాలను రూపుమాపడం సాధ్యపడుతుంది. ఇది మననుండి ప్రారంభంకావాలి.

సంయుక్త సోషలిస్టుపార్టీ జాతీయ కార్యవర్గంలో పాతిక శాతంకో పై వెనుకబడిన వారికి స్త్రీలకు స్థానం వుంది. ఏదో విధంగా వెనుకబడినవారిని, స్త్రీలను బలవంతంగా ముందుకు తీసుకొని వస్తేగాని అగ్రకులాలవారి ఆధిపత్యాన్ని నిర్మూలించడం సాధ్యంకాదు.

ఆ తరువాత డాక్టర్ లోహియా ఇతర విషయాలనుగురించి మాట్లాడుతూ పాలకవర్గ పార్టీని ఓడించడానికి తగిన వాతావరణాన్ని సృష్టించాలన్నారు.

"కాంగ్రెసును ఓడించే సంకల్పంతో వివిధ ప్రతిపక్షాల మధ్య అచ్చితమైన ఒడంబడిక జరగాలనినేనువాంఛించుచున్నాను. అదిసాధ్యం కాని పక్షంలో ప్రతి ఎన్నికలవారు పరస్పరం పోటీ చేసుకోరాదనే కనీస ఒడంబడికనైనా కుదుర్చుకోవాలి నేడున్న పరిస్థితులలో "పరస్పరం పోటీకూడదు" అనే వినాదాన్ని వ్యతిరేకించే వారు తెలిసో తెలియకో కాంగ్రెసు ఏజెంటుగా పనిచేస్తున్నారని భావించవలసి వస్తుంది.

సంయుక్త సోషలిస్టుపార్టీ నిర్మాణ వ్యవహారాలను గురించి ఆయన ప్రస్తావించి కొత్త వారిని పార్టీలోకి తీసుకొనిరావడానికి ప్రయత్నించాలన్నారు. ప్రస్తుతం అందరూ పాతవారితోనే తృప్తిచెందుతున్నారనీ. ఈ విషయం మన దేశంలోని అన్ని పార్టీలకూ వర్తించుతుందనీ అన్నారు.

నెలకు వెయ్యి రూపాయలకు మించి ఏ ఒక్క వ్యక్తికి ఖర్చుఉండరాదనే విషయమై కూడా ప్రతిపక్షాలన్నింటి మధ్య ఒడంబడిక కుదరాలన్నారు. ఇలాచేస్తే వ్యవసాయ, పారిశ్రామికాభివృద్ధి కార్యక్రమాలకు 2500 కోట్ల రూపాయలు మిగులుతాయన్నారు.

మణిపూర్, బర్మా సరిహద్దులో నాగావిద్రోహ చర్యలు

న్యూఢిల్లీ, జూలై 15

మణిపూర్‌ను సరిహద్దును ఆనుకొని వున్న బర్మా భూభాగంలో తిష్టవేసిన నాగా విద్రోహుల కార్యకలాపాల గురించి మణిపూర్ చీఫ్ కమిషనర్ నిన్న కేంద్ర హోం మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు

నాగా తిరుగుబాటుదారులు మాత్రమే గాక, మరి కొన్ని కొండజాతులవారు గూడా అటు బర్మానుండి, మణిపూర్‌లోనికి చొరబడటానికి పదే పదే జరుపుతున్న ప్రయత్నాలను గూడ చీఫ్ కమిషనర్ శ్రీ పండా వివరించినట్లు తెలుస్తున్నది.

భారత దేశం పట్ల ఆఫ్రికా ప్రజల మైత్రి

ఉప రాష్ట్రపతి రేడియో ప్రసంగం

న్యూఢిల్లీ, జూలై 15

తాను పర్యటించిన ఆఫ్రికా రాజ్యాలన్నింటిలోనూ, భారతదేశం పట్ల నిజమైన మైత్రీ, కీర్తిశేషులయిన మన ప్రధాని నెహ్రూ పట్ల హృదయాల్ని పులకింపజేసే ఆప్యాయత, అభిమానమూ వ్యక్తమౌతున్నాయని, అల్జీరియా, మొరాకో, టునీషియా దేశాలపర్యటన నుండి తిరిగివచ్చిన ఉపరాష్ట్రపతి డాక్టర్ జాకిర్ హుసేన్ నిన్న ఆల్ ఇండియా రేడియోలో ప్రసంగిస్తూ చెప్పారు

వ్యాపార వాణిజ్యరంగాలలోనూ, సాంస్కృతిక విషయాల్లోనూ, ఆదేశాలతో మన సంబంధాలను పెంపొందించుకోవడానికి అవకాశం విస్తారంగావుందని ఆయన అన్నారు

భారతీయులం ఆ దేశ ప్రజలను మరింత సన్నిహితంగా అర్థం చేసుకోవాలి వాళ్ళుచాలా సత్స్వభావులు, వారు మన హృదయాలనిట్టే ఆ కట్టుకుంటారు. ఆ దేశాల ప్రజలు శ్రమశీలురు, నిజమైన మిత్రులకుండదగిన లక్షణాలన్నీ వారిలో కన్పించుతాయి." అని ఆయన వారిని ప్రస్తుతించారు

వారు తమ దేశాలలో సుఖమయమైన జీవితాల్ని సృష్టించుకొనేటందుకు కష్టపడి పని చేస్తున్నారు,విద్యావ్యాప్తిగావించుకొంటున్నారు భూసంస్కరణల నమలుజరుపుతుంటున్నారు. పరిశ్రమలను నిర్మించుకొంటున్నారు. క్లుప్తంగా చెప్పాలంటే తమ దేశాలనూ, జీవితాలనూ వారు పునర్నిర్మించుకుంటున్నారు. అని ఆయన వివరించారు

విద్యార్థి దశనుండీ తనకా దేశాల ప్రజల పట్ల చాలా శ్రద్ధ, ఆసక్తి వుండేదని చెబుతూ, "ఆ దేశాలలో అడుగడుగునా మనకు స్వాతంత్ర్యదీప్తిదర్శనమిస్తూఉంది" అన్నారు.

శరావతి ప్రాజెక్టు వ్యవహారాలు

దర్యాప్తు జరిపించాలని మైసూరు శాసనసభలో డిమాండ్

బెంగుళూరు, జులై 14

ప్రస్తుతం నిర్మాణంలో వున్న శరావతి లోయ విద్యుత్ ప్రాజెక్టు వ్యవహారాలపై న్యాయవిచారణ జరిపించాలని మైసూరు శాసనసభలో నేడు తిరిగి ప్రతిపక్షసభ్యులు డిమాండ్ చేశారు.

బడ్జెట్ సమావేశం సందర్భంలో ఆ ప్రాజెక్టు సమస్యపై ప్రభుత్వం సమర్పించిన ఒక నివేదికపై నేడు చర్చ జరిగింది.

ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ఏదో కుంభకోణం జరుగుతున్నదనీ, అందువలన పరిపూర్ణమైన దర్యాప్తు జరగాలనీ ప్రతిపక్ష సభ్యులు కోరారు.

ప్రతిపక్ష నాయకుడు శ్రీ శివప్ప చర్చను ప్రారంభిస్తూ ఇప్పటికి ఆ ప్రాజెక్టుపై ప్రభుత్వం ఒకకోటి యాభై లక్షల రూపాయల మేరకు నష్టపడిందనీ, ఇందుకు అధికారులే కారణమని అన్నారు.

కాంగ్రెసు సభ్యుడు శ్రీ గంజి వీరప్ప మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రతిపక్ష సభ్యుల ఆరోపణలు అన్యాయంగా వున్నా యన్నారు, ప్రాజెక్టు నిర్మాణంలో కుంభకోణమేమీ జరగడం లేదన్నారు

కంట్రాక్టరు, ఇంజనీర్లు కలిసి ఏదో ఒక రకమైన కుట్రను పన్నారనీ, అందువల్లనే కార్మికులకి యిచ్చే జీతాల రేట్లను, ఇతర రేట్లను అనేకసార్లు మార్చడం జరిగిందని శ్రీ శివప్ప ఆరోపించారు.

ఆదిలాబాద్‌లో కాందిశీకుల పునరావాసం ఏర్పాట్లు

హైదరాబాద్, జూలై 16

తూర్పు పాకిస్తాన్ నుండి వచ్చిన 12 వేల మంది కాందిశీకులకు పునరావాసం కల్పించేటందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లాలో 12000 యకరాల భూమిని సర్వే జరిపించుతూ వుంది.

జయప్రకాశ్‌తో లోహియా చర్చలు

న్యూఢిల్లీ, జూలై 14

కొత్తగా ఏర్పడిన సంయుక్త సోషలిస్టు పార్టీలో చేరి దేశం విప్లవకర తీవ్రవాద రాజకీయాల్లో పాల్గొనవలసిందిగా శ్రీ జయప్రకాశ్ నారాయణను డాక్టర్ రామమనోహర్‌లోహియా ఆహ్వానించారు

వారుభయులూ నేడిక్కడ ఒక విందు సందర్భంలో కలుసుకొని భారత రాజకీయ పరిస్థితిని గురించి 90 నిముషాలపాటు చర్చ జరుపుకొన్నారు

అనుకొన్నట్లు వారిద్దరూ మరల సాయంత్రం కలుసుకోలేదు. అయితే రేపు శ్రీ జయప్రకాశ్ నారాయణ జయపూర్‌కు బయలుదేరి వెళ్ళే ముందు వారు కలుసుకొని తమ సంభాషణలను కొనసాగిస్తారు.

1957 తరువాత వారిద్దరూ కలుసుకొని ఇంత హెచ్చు సేపు మాట్లాడుకోవటం యిదే మొదటిసారి.

సంభాషణల అనంతరం డాక్టర్ లోహియా పత్రికలవారితో మాట్లాడుతూ తాను శ్రీ జయప్రకాశ్‌ను సంయుక్త సోషలిస్టుపార్టీలోచేరి దేశ విప్లవకర, తీవ్ర రాజకీయాల్లో' పాల్గొనవలసిందిగా ఆహ్వానించానని చెప్పారు.

శ్రీ జయప్రకాశ్ మాత్రం తాను లోహియాతో జరిపిన సంభాషణల వివరాలను చెప్పడానికి నిరాకరించారు. 'ఇద్దరు పాత మిత్రుల సమావేశంగా" మాత్రంగానే దానిని ఆయన పేర్కొన్నారు

విలేకరులు అడిగిన మరికొన్ని ప్రశ్నలకు శ్రీ జయప్రకాశ్ సమాధాన మిస్తూ ఇలా చెప్పారు.

"డాక్టర్ లోహియా అభిప్రాయాలను అర్థం చేసుకోవాలనీ, కొన్ని సమస్యలపై నా అభిప్రాయాలను ఆయన అర్థం చేసుకొనేటట్లు చేయాలని నేను ఆయనను కలుసుకొన్నాను.'

తాను చేయగలిగిన ప్రతిపాదన లేమీలేవని కూడా ఆయన అన్నారు.

పార్టీ రాజకీయాల్లో ప్రవేశించవలసిందిగా డాక్టర్ లోహియా ఆహ్వానంపై మీఅభిప్రాయమేమిటని ప్రశ్నించగా "నా నిర్ణయంలో మార్పేమీలేదు" అని అన్నారు.

శ్రీ జయప్రకాశ్ ప్రస్తుతం సర్వోదయ ఉద్యమంలో వున్నారు. డాక్టర్ లోహియా కొత్తగా ఏర్పడిన సంయుక్త సోషలిస్టుపార్టీలో సభ్యుడుగాచేరలేదు. అయితే ఆపార్టీ బలపడేందుకు తాను సహాయపడి కాంగ్రెసుపార్టీని త్వరలో నాశనం చేయదలచానని డాక్టర్ లోహియా చెప్పారు.

డాక్టర్ లోహియాను కలుసుకునేముందు శ్రీ జయప్రకాశ్ సంయుక్త సోషలిస్టు పార్టీ కార్యదర్శులైన శ్రీ రాజనారాయణ, శ్రీ ప్రేమదాసినులను కలుసుకొని మాట్లాడారు. నిన్న ఆయన శ్రీ అశోకమెహతాను కలుసుకొని మాట్లాడారు.

జయప్రకాశ్‌తో తన సంభాషణలను గురించి వర్ణించుతూ లోహియా ఇలా అన్నారు.

గత పది పన్నెండు సంవత్సరాలుగా మా యిద్దరి మధ్య అత్యంత మిత్రత్వం, అత్యంత అమిత్రత్వమూమా మధ్య కలదు.

జయప్రకాశ్ విప్లవ రాజకీయాల్లో పాల్గొంటే కాంగ్రెసుపై పోరాటంలో తన కెంతగానో సహాయంగా వుండగలదని కూడా డాక్టర్ లోహియా అన్నారు.

మీ సంభాషణలవలన రాజకీయంగా ఏమైనా ఫలితముందా అని ప్రశ్నించగా "ఒకటి రెండు రోజుల్లో ఏమీ జరగకపోవచ్చు, కాని కొంత కాలమైన తరువాత ఏదైనా జరుగవచ్చు."అని అన్నారు.

కాంగ్రెసును "నాశనం" చేయడం, లేదా ఆ పార్టీని ఒకసారి ఓడించడం తన లక్ష్యమని డాక్టర్ లోహియా అన్నారు.

రైతులకు శిక్షణా పథకం

న్యూఢిల్లీ, జూలై 14

రైతులకు ప్రత్యేకశిక్షణ నిమిత్తం ఒక పథకాన్ని కేంద్ర ఆహార మంత్రిత్వశాఖ రాష్ట్ర ప్రభుత్వాలకు పంపింది.

ప్రతి సంవత్సరమూ దాదాపు 40 వేల మంది రైతులకు పదినుండి 15 రోజులవరకూ వ్యవసాయంలో ప్రత్యేక శిక్షణ గరపడానికి ఈ పథకం వీలు కల్పిస్తుంది.

ఈ పథకాన్ని అమలు జరపడానికి అనేక రాష్ట్ర ప్రభుత్వాలు సమ్మతించి నప్పటికీ ఈ పథకం అమలుకు ఇంకా ఏర్పాట్లు చేయవలసివుంది.

రైతుయువకులకు, గ్రామ సహాయకులతో బాటుగా ఎన్నిక చేయబడిన గ్రామ వాలంటీరు దళాలకు ఈ శిక్షణలో ఎక్కువ ప్రాతినిధ్యం కల్పించే వీలుగా ఈ పథకాన్ని పునర్వ్యవస్థీకరించాలని సామాజికాభివృద్ధి మంత్రిత్వశాఖ ప్రతిపాదిస్తున్నట్లు తెలుస్తున్నది

గ్రామసేవకులకు ప్రత్యేక శిక్షణకు వీలు కల్పించే నిమిత్తం వ్యవసాయం పశుపోషణ మున్నగు ప్రత్యేక రంగాల్లో అనుభవమున్న కార్యకర్తలను నాలుగవ పంచవర్ష ప్రణాళికా కాలంలో నూతన శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించడానికి కూడా ఆహార వ్యవసాయ మంత్రిత్వశాఖ సంకల్పించింది.

ప్రతి విషయంమీద ఎన్నికచేసిన ప్రభుత్వ వ్యవసాయ సంస్థలో అయిదు కేంద్రాలను ప్రారంభిస్తారు. ఇలాంటివి 25 కేంద్రాలు నెలకొల్పబడగలవని భావిస్తున్నారు.

నాలుగవ ప్రణాళికలో 15 వేల మంది గ్రామ సేవకులకు ఈ కేంద్రాల్లో 750 కోర్సులలో ఈ శిక్షణ యివ్వడానికి సంకల్పించినట్లు తెలుస్తూవుంది.

అక్టోబర్‌నుండి ఢిల్లీ- లండన్ సరాసరి విమానయానం

లండన్, జూలై 15

ఢిల్లీ నుండి మాస్కోమీదుగా లండన్‌వరకు యీ సంవత్సరం అక్టోబర్‌నుండి సరాసరి విమానాలు నడుస్తాయని నిన్న లండన్‌లో ప్రకటించారు

ఈ కొత్త సర్వీసును భారతీయ పౌర విమానయాన సంస్థ నిర్వహిస్తుంది.

ఈ మార్గంలో విమానాలు నడుపుకునే విషయం సోవియట్ విమానయాన సంస్థ ఏరోఫ్లాట్'కూ భారతీయ విమానయాన సంస్థ 'ఏర్ యిండియా'కూ మధ్య యిటీవలనే ఒప్పందం కుదిరింది.

మాస్కో మీదుగా యీ కొత్త మార్గం యేర్పాటుతో సుమారు 5½ గంటలకాలం కలిసివస్తుంది. ఢిల్లీనుండి లండన్‌కు గానీ తిరుగు ప్రయాణానికిం గానీ 12 గంటలు మాత్రమే పడుతుంది.

కామన్‌వెల్తు దేశాలకు ఒక శాశ్వత సెక్రటేరియట్

లండన్, జూలై 14

కామన్‌వెల్తు దేశాలకు ఒక శాశ్వత సెక్రటేరియట్ ఏర్పడుతుందని, దానితోపాటు ప్రధాన కార్యదర్శినికూడా సభ్యదేశాలు ఎన్నుకుంటాయని ఇక్కడ సమావేశమవుతున్న కామన్‌వెల్తు మహాసభ వర్గాలు తెలియచేశాయి.

దీనికి సంబంధించిన వివరాలతోకూడిన డాక్యుమెంటు ప్రధానుల ముందు ఉందనికూడా వారు తెలియచేశారు.

కామన్వెల్తు దేశాలమధ్య ఉండవలసినసహకారం ప్రపంచ ఆర్థికవ్యవహారాల సమస్యలను నేడు ప్రధానులు చర్చించటంతో మహాసభ ముందున్న ఎజండా పూర్తయింది. మహాసభ విడుదల చేయవలసిన సంయుక్త ప్రకటనను గురించి రేపు తుదిసారిగా ప్రధానులు సమావేశమవుతారు.

రేపటి సమావేశంలోనే దక్షిణ రొడీషియా, బ్రిటిషుగయానా సమస్యలను కూడ చర్చిస్తారు.

బడుగు దేశాలకు ఆర్థిక సహాయం చేయటంపై బ్రిటన్ చేసిన వాగ్దానాలు, ఒప్పందాలు ఎక్కువ మోతాదులోనే ఉన్నాయని, ఆ స్థాయిని మించి ముందుకుపెళ్ళే ప్రతిపాదన ఏమీ లేదని బ్రిటన్ ఆర్థికమంత్రి రిజినాల్డు మాడ్లింగ్ నేటి సమావేశంలో చెప్పినట్లు తెలుస్తూంది. స్వదేశంలో పెట్టుబడి పెరగనిదే, సహాయ రూపంలోగాని, లేదా విదేశాలలో పెట్టుబడులు పెట్టటంలో గాని సాధ్యంకాదని ఆయన తెలియచేశారు.

పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ ప్రసంగిస్తూ బడుగుదేశాలకు సమిష్టిసహాయం చేయాలని, ఆ ఋణాన్ని తిరిగి ఆ దేశాలు తమ ఉత్పత్తుల్ద్వారా తీర్చుకుంటాయని అన్నారు.

ఈ ప్రతిపాదన కొత్తదేమీకాదని, జెనీవా మహాసభలో దీనిని పూర్తిగా చర్చించటం జరిగిందని మహాసభ వర్గాలు తెలియచేశాయి.

బడుగుదేశాలకు, పారిశ్రామిక దేశాలకు మధ్య నూతనసంబంధాలు ఏర్పడుతున్నాయని, బడుగు దేశాల వ్యవసాయ ఉత్పత్తిని పారిశ్రామిక దేశాలు ఎక్కువగా ఉపయోగించుకొని వారి పారిశ్రామిక వస్తువులను ఆ దేశాలకు ఇవ్వాలని ఘనా అధ్యక్షుడు న్క్రుమా చెప్పినట్లు తెలుస్తుంది.

టాంగనీకా అధ్యక్షుడు నైరేరి, ఉగాండా ప్రధాని ఓబుటులు కూడ నేటి చర్చలలో పాల్గొన్నారు.

భారత ఆర్థిక మంత్రి శ్రీ టి. టి.కృష్ణమాచారి నేటి చర్చలలో పాల్గొనలేదు.

దక్షిణ రొడీషియా సమస్యపై కెనడా ప్రధాని పియర్సన్ నిన్నచేసిన ప్రసంగానికి ఆసియా-ఆఫ్రికా దేశాలు తమ సంతృప్తిని వెల్లడించాయి.

వివిధ దేశాలలో అనేక జాతులకు సంబంధించిన ప్రజలంతాకలిసి జీవించేందుకు, సమానత్వం, స్వేచ్ఛకలిగిన పౌరులుగా అభివృద్ధి చెందేందుకు తోడ్పడేలా ప్రజాస్వామిక సూత్రాలను అమలు పరచేందుకు కామన్‌వెల్తు దేశాలు ప్రయత్నించాలని ఆయన అన్నారు.

ఆఫ్రికా శిఖరాగ్రసభకు షోంబేను రానివ్వరాదు

విదేశాంగ మంత్రుల నిర్ణయం

కైరో జూలై 14

జూలై 17 నుండి కైరోలో జరిగే ఆఫ్రికా శిఖరాగ్ర సమావేశానికి కాంగో ప్రధాని షోంబే హాజరుకారాదని, అధ్యక్షుడు కసవూబూకు ఆఫ్రికా సమైక్య సంస్థ మంత్రుల సమావేశం స్పష్టం చేసింది.

ఆ సమావేశానికి షోంబేను పంపరాదని నేటి రాత్రి టెలిగ్రాం ద్వారా కసవూబూకు తెలియచేశారు.

శిఖరాగ్ర సమావేశానికి షోంబే హాజరు కాకపోవచ్చునని ఆఫ్రికా సమైక్యసంస్థ అధికార ప్రతినిధి ఒకరు తెలియ చేశారు.

ఇప్పుడు సమావేశమవుతున్న విదేశాంగ మంత్రుల సభకు హాజరయ్యేందుకు ఆయనను అనుమతిస్తారా అన్న ప్రశ్నకు 'నాకు తెలియదు' అని ఆ ప్రతినిధి సమాధాన మిచ్చారు.

లుముంబా కుటుంబం

కాంగో మాజీప్రధాని అమరజీవి లుముంబా కుటుంబం కాంగో తిరిగి రావాలని తా మాశిస్తున్నట్టు త్షోంబే మంత్రివర్గం లియోపోల్డ్‌విల్లిలో ఒక ప్రకటన చేసింది.

1961 జనవరిలో కటంగాలో లుముంబా హత్య గావించబడిన కొద్దిరోజులకే లుముంబా భార్య, ఆయన పిల్లలు కైరో వెళ్ళిపోయారు.

షోంబే హాజరవుతాడట

ఆఫ్రికా దేశాల శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని షోంబే హాజరుకాబోతున్నారని మంత్రివర్గం నేడిక్కడ ఒకప్రకటన విడుదలచేసింది.

శిఖరాగ్ర సమావేశానికి షోంబే హాజరవటానికి గతరాత్రి సమావేశమయిన మంత్రివర్గం అంగీకరించిందని ఈ ప్రకటనలో వుంది.

శిఖరాగ్ర మహాసభకు తాను హాజరవ్వాలని కుతూహలం పడుతున్నట్లు ఇంతకు ముందే కసవుబు ఒక ప్రకటన చేశారు.

అలెప్పీలో మొన్న ఒక పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మధ్య దెబ్బలాట జరిగింది. ఇద్దరు విద్యార్థులను ఆసుపత్రిలో చేర్చారు.

దేశంనుండి, విడి పోవాలనే ప్రచారం

శిక్షార్హమయిన నేరంగా పరిగణిస్తూ వచ్చే పార్లమెంటు సమావేశంలో బిల్లు

న్యూఢిల్లీ, జూలై 14

భారతదేశం నుండి ఏ భాగమైనా విడిపోవాలని ప్రచారం చేయటం శిక్షార్హమైన నేరంగా పరిగణించే బిల్లు ముసాయిదాను హోం మంత్రిత్వ శాఖ తయారు చేసింది. ఈ బిల్లును పార్లమెంటు వర్షాకాలపు సమావేశంలో ప్రవేశపెడతారు.

ఈ బిల్లును ప్రస్తుతం న్యాయశాఖ మంత్రి పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

కొత్తగా తలపెట్టిన యీ బిల్లులోని నిబంధనలను అమలుపరచటానికి ప్రభుత్వం ఆర్డినెన్సు ప్రకటించే సూచన ఏమీ లేదని హోంశాఖ కార్యదర్శి శ్రీ వి. విశ్వనాథన్ తెలియ జేశారు. ప్రభుత్వం ఆర్డినెన్సు జారీ చేయాలను కుంటోందని కొన్ని పత్రికలలో వార్తలు వచ్చాయి.

దేశంనుండి విడిపోవాలని ప్రచారం చేసే వారిని శిక్షించేందుకు ప్రభుత్వానికి శాసనంచేసే అవకాశం యిచ్చేందుకు రాజ్యాంగానికి సవరణనుకూడా పార్లమెంటు యిదివరకే ఆమోదించింది. ఈ సవరణకు అనుగుణంగానే ప్రస్తుతం పరిశీలనలోఉన్న బిల్లు తీసుకొస్తున్నారు.

మరోలక్ష గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా

నాల్గవ ప్రణాళికలో చేయాలని సూచన

న్యూఢిల్లీ, జూలై 14

నాల్గవ పంచవర్ష ప్రణాళికాకాలంలో అదనంగా లక్ష గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయాలని తలపెట్టారు.

గ్రామీణ ప్రాంతాల్లో విద్యుచ్ఛక్తిసరఫరాకు అయ్యే ఖర్చులను తగ్గించేందుకు తీసుకునే చర్యలను గురించి కేంద్ర విద్యుచ్ఛక్తి మంత్రిత్వ శాఖ పరిశీలిస్తోంది.

గ్రామీణ ప్రాంతాలలో విద్యుచ్ఛక్తి పంపిణీ విధానాన్ని వేయటానికి తగిన వనరులు లభ్యం కావటం చాలా కష్టముగా వుంది. నాల్గవ ప్రణాళికా కాలంలో ఇందుకుగాను 400 నుండి 500 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు.

గోవాలో బాంబు ప్రమాదాలు

ఇంతవరకు పన్నెండు మంది అరెస్టు

పాంజిమ్, జూలై 14

గోవాలో జూన్ 20 వ తేదీన జరిగిన బాంబు (పేలుళ్ళ) ప్రమాదాల సందర్భంగా తంతి తపాలాశాఖకు చెందిన వైర్‌లెస్ కేంద్రంలోని రేడియో సాంకేతికనిపుణుణ్ణి పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేంద్రం యిచ్చటకు అయిదుమైళ్ళ దూరంలోఉన్న బాంబోలిం వద్ద ఉన్నది.

ఈ సందర్భంగా యింతవరకూ పన్నెండు మందిని అరెస్టు చేశారు.

ఇల్లంనాయుడువలసలో అగ్ని ప్రమాదం

రాజాం, జూలై 12

శ్రీకాకుళంజిల్లా పాలకొండ తాలూకా ఇల్లంనాయుడు వలస గ్రామంలో జూలై 9 వ అగ్ని ప్రమాదం సంభవించి గ్రామం పూర్తిగా తగులబడిపోయింది ఆస్తి నష్టం సుమారు రు.25 000 అని అంచనా .అగ్నిబాధితులు అందరూ పేదవారు. వర్షాలు పడుచుండుటచే తలదాచు కొనుటకు స్థానమైనాలేని దీనాతిదీన పరిస్థితిలో వీరు ఉన్నారు.

ఏలూరు ప్రెస్‌వర్కర్సు యూనియన్

నూతన కార్యవర్గ ఎన్నికలు

ఏలూరు, జూలై 12

ఏలూరు ప్రెస్‌వర్కర్సు యూనియన్ సర్వసభ్య సమావేశం శ్రీ ఎ శ్రీరాములుగారి అధ్యక్షతను జూలై 9 వ జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర సంఘ అధ్యక్షులు శ్రీ బసిశెట్టి అప్పారావు, కార్యదర్శి శ్రీ యల్. భోగరావు గార్లు పాల్గొన్నారు

ప్రెస్ కార్మికులకు సంవత్సరానికి 1 నెల బోనస్ యివ్వాలనీ, యీ ధరల పెరుగుదలకు అనుగుణంగా కరువు భత్యం పెంచాలనీ తీర్మానించారు. నూతన సంవత్సరానికి ఈ దిగువ సభ్యులను కమిటీగా ఎన్నుకొన్నారు.

అధ్యక్షులు సి హెచ్. గంగరాజు, ఉపాధ్యక్షులు: సిహెచ్ నారాయణ. ప్రధాన కార్యదర్శి శ్రీ పామర్తి సుబ్బారావు, సహాయ కార్యదర్శి: శ్రీ జి రామవులు, కోశాధికారి శ్రీ కె విశ్వేశ్వరరావు ప్రెస్‌లవారీగా ఆరుగురు సభ్యులను కార్యనిర్వాహకవర్గ సభ్యులుగా ఎన్నుకొన్నారు.

ఉయ్యూరు, జూలై 10

ఉయ్యూరు హిందీ ప్రేమీమండలి యాజమాన్యమున నడచుచున్న జూనియర్ హిందీ పండిట్సు ట్రైనింగ్ ప్రభుత్వంవారి ఉత్తర్వు ననుసరించి రాష్ట్రభారతి విజయవాడ-2 కు బదిలీచేయబడినది. గాన శిక్షణార్థులు తమ తమ దరఖాస్తులను రాష్ట్రభారతి విజయవాడ-2కు పంపుకొనవలసివున్నది.

చిన ఓగిరాలలో గజదొంగ పట్టివేత

ఇంటికి కన్నం వేస్తుండగా

చినఓగిరాల, జూలై 14

కృష్ణాజిల్లా చినఓగిరాలలో గత రాత్రి గుంటూరు నుంచి టాక్సీలో వచ్చిన ఆరుగురు దొంగలు ఒక ఇంటికి కన్నం వేస్తుండగా, గ్రామస్థులు వారందరిని పట్టుకొని, పోలీసులకు అప్పగించారు

ఆ దొంగల ముఠాకు నాయకుడైన వ్యక్తి గజదొంగ అని, ప్రభుత్వానికి పట్టుబడకుండా తప్పించుకు తిరుగుతున్నాడని తెలుస్తున్నది.

గుంటూరు కిరాణా, చిల్లర వర్తకసంఘ మెమోరాండం

గుంటూరు, జూలై 11

కేంద్ర ప్రభుత్వ సరఫరా శాఖ మంత్రి శ్రీ కొత్త రఘురామయ్యగారు గుంటూరు విచ్చేసిన సందర్భంలో 10 వ తేదీ సాయంత్రం ఇండియన్ ఛాంబర్సు బిల్డింగులో గుంటూరు కిరాణా, రిటైల్ మర్చంట్సు అసోసియేషన్ సమావేశము జరిగినది.

సభకు శ్రీ రాచపూడి వెంకట సుబ్బారావు గారు అధ్యక్షత వహించారు.

ఆహార కల్తీ నిరోధక చట్టం సవరణ సందర్భంలో చిల్లర వ్యాపారస్తులు ఎదుర్కొనగల చిక్కులను గురించి, వాటి నివారణకు మార్గములను గురించి, మంత్రిగారికి మెమోరాండం సమర్పించారు.

అసోసియేషన్ ఉపాధ్యక్షులు శ్రీ వచ్చిపులుసు సుబ్రహ్మణ్యం, శ్రీ మద్ది సుదర్శనం గార్లు ప్రసంగించారు.

మంత్రి తమ సమాధానములో విషయములన్నీ సాకల్యముగా పరిశీలించి, సానుభూతితో పరిష్కరించగలమని హామి యిచ్చారు.

కార్యదర్శి శ్రీ మాజేటి సత్యనారాయణరావు వందన సమర్పణ చేశారు.

పబ్లిక్ వర్క్సు శాఖలో జరుగుతున్న అక్రమాలు

కంట్రాక్టర్లకు రెండులక్షల రూపాయలకు పైగా అదనంగా చెల్లింపు

న్యూఢిల్లీ జూలై 14

కాంట్రాక్టర్లకు అదనంగా చెల్లించిన రెండు లక్షల ఇరవైఎనిమిదివేల రూపాయలు వసూలు చేయమని కేంద్ర పబ్లిక్ వర్క్సు శాఖవారిని గృహ నిర్మాణ మంత్రిత్వశాఖ చీఫ్ టెక్నికల్ తనిఖీ అధికారి కోరారు

1964 సంవత్సరం ఏప్రిల్ నుండి జూన్ వరకు జరిగిన వివిధ నిర్మాణ పథకాల ఖర్చులను తనిఖీ చేసేటప్పుడు చీఫ్ టెక్నికల్ తనిఖీ అధికారి యీ అదనపు చెల్లింపును కనుగొన్నారు.

1963-64 సంవత్సరంలో 4 84 లక్షల రూపాయలు అదనంగా కంట్రాక్టర్లకు చెల్లించినట్లు కూడా చీఫ్ టెక్నికల్ తనిఖీ అధికారి కనుగొన్నట్లు నేడు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలియ జేశారు ఈ మొత్తాన్ని కంట్రాక్టర్లనుండి తిరిగి వసూలు చేయవలసి ఉంది.

చీఫ్ టెక్నికల్ తనిఖీ అధికారి కార్యాలయాన్ని 1957 సంవత్సరంలో ఏర్పాటు చేశారు ఇంతవరకు 38 56 లక్షల రూపాయల అదనపుచెల్లింపును కనుగొన్నారు

తీవ్రమైన అవకతవకలు జరిగిన కేసుల సందర్భంలో అందుకు సంబంధించిన అధికారులపై చర్య తీసుకోవటం ప్రారంభమైంది. ఇంతవరకూ 87 మంది ఉద్యోగులకు పెనాల్టీలు విధించారు. వీరిలో 22 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, 36 మంది అసిస్టెంటు ఇంజనీర్లు, 38 మంది సెక్షన్ ఉద్యోగులు ఉన్నారు.

పూర్ణియా జిల్లాలో చక్కెర ఫ్యాక్టరీ

సహకార రంగంలో ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అంగీకారం

పాట్నా, జూలై 13

పూర్ణియా జిల్లాలోని బన్‌మన్‌ఖి వద్ద 1.40 కోట్ల రూపాయల ఖర్చుతో సహకార రంగంలో కొత్త చక్కెర మిల్లు స్థాపన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది.

ఈ చక్కెరఫ్యాక్టరీ 1965వ సంవత్సరంలో పని ప్రారంభిస్తుందని అంచనా వేస్తున్నారు మొదట్లో రోజుకు వెయ్యిటన్నుల చెరకు ఆడే శక్తి గల యంత్రాలతో ప్రారంభిస్తారు.

కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో పారిశ్రామిక ఆర్థిక సంస్థ యీ ఫ్యాక్టరీ నిర్మాణానికి అయ్యే ఖర్చులో తొంభై లక్షల రూపాయలు అప్పుగా యిస్తుంది. మిగిలినదానిని రాష్ట్రప్రభుత్వం, చెరకు పండించే రైతులు, సహకార సంఘాలు పెట్టుకుంటాయి

గత మాసంలో కంపెనీ 3 లక్షల రూపాయల వాటాల అమ్మకం ప్రారంభించాయి. ఏడు లక్షల రూపాయల విలువగల వాటాలు అమ్ముడు పోయాయి.

పూర్ణియా జిల్లాలో చెరకు ఎక్కువగా పండుతుంది అయినా యింతవరకూ ఒక్కచక్కెర ఫ్యాక్టరీ లేదు.

విజయవాడ ఘటనల సందర్భంలో కేసులు

సెషన్సు కోర్టులో విచారణ తేదీలు

విజయవాడ, జూలై 14

విజయవాడప్రిన్సిపల్ సబార్డినేట్ జడ్జికోర్టులో పట్టణ కమ్యూనిస్టు నాయకులు శ్రీ దలసాని వెంకటరత్నం మొదలగువారిపై పెట్టిన కేసుల విచారణ ఆగస్టు 3 నుండి 6 వరకు ఆగస్టు 24 నుండి 27 వరకు జరుగుతాయి. స్థానిక శాసన సభ్యుడు శ్రీ తమ్మిన పోతరాజు మొదలగువారిపై పెట్టిన కేసులు ఆగస్టు 10 నుండి 14 వరకు విచారణ జరుగుతాయి

ఇండొనేషియాకు ఆహార దిగుమతులు

ఆగస్టు 17 నుండి నిలిపి వేస్తున్నట్లు అధ్యక్షుని ప్రకటన

జకార్తా, జూలై 14

వచ్చే ఆగస్టు 17 వ తేదీనుండి ఆహార దిగుమతు లన్నిటిని ఆపివేస్తున్నట్లు ఇండొనేషియా అధ్యక్షులు సుకర్నో నిన్న ప్రకటించారు. ఆగస్టు 17 వ తేదీ ఇండొనేషియా 19 వ స్వాతంత్ర్య దినోత్సవం.

పరిశ్రమల శాఖాధికారుల సమావేశంలో మాట్లాడుతూ సుకర్నో, దేశంలో ఉత్పత్తి అయ్యే ఆహార ధాన్యాలపై పూర్తిగా ఆధార పడాలనీ, బియ్యం తక్కువగాతినాలని ప్రజల్ని కోరారు.

ఇండొనేషియా ప్రస్తుతం పదిలక్షల టన్నుల బియ్యాన్ని దిగుమతి చేసుకుంటున్నది.

వస్త్రాల ఉత్పత్తిలో స్వయంపోషకం కావడం కష్టమని అంగీకరించి, అయితే తగినన్ని వస్త్రాలు ప్రభుత్వం దిగుమతి చేసుకోగల దన్నారు

మలేషియా తగాదా విషయం ప్రస్తావించి నయా వలస విధానపు సమూహ్యాను అంత మొందించడానికి తన స్నేహితులనుండి సహాయం అర్థించ దన్నారు. సామ్రాజ్యవాదాన్ని, వలస విధానాన్ని ఎదుర్కోటానికి నూతనంగా ఆవిర్భవిస్తున్న శక్తులమధ్య సమైక్యత ఉండాలని మాత్రమే ఇండొనేషియా కోరుతోం దన్నారు.

ఇండొనేషియాను ఎదుర్కోటానికి పశ్చిమ దేశాల సహాయం అర్థించినందుకు మలయా ప్రధానిని విమర్శించారు. అతను సహాయం కోసం ఆఫ్రో-ఆసియా దేశాల వద్దకుకాక సామ్రాజ్యవాద దేశాల వద్దకు వెళ్ళా దన్నారు.

కొత్తగూడెంలో శ్రీ కె. ఎల్. రావు

కొత్తగూడెం, జూలై 14

కొత్తగూడెంలో నిర్మిస్తున్న థర్మల్‌విద్యుత్ కేంద్రాన్ని, కేంద్ర ఇరిగేషన్, విద్యుచ్ఛక్తి శాఖ సహాయ మంత్రి డాక్టర్ కె ఎల్ రావు నిన్న సందర్శించారు. ఆంధ్ర ప్రదేశ్ విద్యుచ్ఛక్తిబోర్డు అధ్యక్షులు శ్రీ జె వి. నరసింగరావు కూడా వీరి వెంట ఉన్నారు.

ఈ కేంద్ర నిర్మాణానికి సంబంధించిన అనేక విషయాలను ఇంజనీర్లతో వారు చర్చించారు.

కొత్తగూడెంలోనిర్మిస్తున్న థర్మల్‌విద్యుత్ కేంద్రంలో 60 మెగావాట్ల శక్తిగల నాలుగు యూనిట్లు ఉంటాయి. మూడవ ప్రణాళికా కాలంలో రెండు యూనిట్లు ఏర్పాటు చేస్తారు, నాల్గవ ప్రణాళికా కాలంలో మిగిలిన రెండు యూనిట్లు ఏర్పాటుచేస్తారు.

డాక్టర్ రావు కిన్నెరసాని ప్రాజెక్టు ప్రాంతాన్నికూడా సందర్శించారు కొత్తగూడెంలో నిర్మించే థర్మల్‌విద్యుత్ కేంద్రానికి యీ ప్రాజెక్టునుండే నీరు సరఫరాచేస్తారు.

అమెరికా రిపబ్లికన్ పార్టీ యుద్ధోన్మాద ప్రచారం

వాషింగ్‌టన్, జూలై 14

రిపబ్లికన్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విదేశాంగ విధానం యుద్ధానికి సన్నాహాలు జరిపేదిగా ఉన్నదని వాషింగ్‌టన్ పోస్టు పత్రిక నేడు వ్యాఖ్యానించింది.

శాన్ ఫ్రాన్సిస్కోలో జరిగిన పార్టీ సదస్సులో సెనేటర్ గోల్డువాటర్ అనుయాయులు ఈ డాక్యుమెంటును ఆమోదించి ప్రకటించారు

1960 లో శాంతియై ఆశాభావాన్ని ప్రకటించిన రిపబ్లికన్‌పార్టీ నేడు యుద్ధానికై సన్నాహాలు జరిపేరీతిలో విదేశాంగ విధానాన్ని ప్రకటించింది. అని ఆ పత్రిక వ్రాసింది.

అణుయుద్ధంలో దేశం సర్వనాశన మయినా తమ లక్ష్యాలను నెరవేర్చుకొనేందుకు గాను సైనికశక్తిని ఉపయోగించటానికి రాజకీయ నాయకులు ఎలా సంసిద్ధత చూపుతున్నారో ఈ ప్రణాళిక చదివితే అర్థమవుతుందని ఆ పత్రిక పేర్కొంది.

నెలాఖరున భారత పాక్ హోం మంత్రుల సమావేశం

న్యూఢిల్లీ జూలై 14

భారత – పాకిస్తాన్ దేశాల హోంశాఖ మంత్రుల సమావేశం రావల్పిండిలో జరుగుతుందని అధికార వర్గాలద్వారా తెలుస్తోంది

సమావేశం ఏ తేదీన జరిగేది పాకిస్తాన్ యింతవరకూ సూచించలేదు. కాని ఈ నెలాఖరులోగా జరగవచ్చు ననుకుంటున్నారు.

హోం శాఖ మంత్రి శ్రీ జి. ఎల్ నందా ప్రధాని శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రిని నేడు కలుసుకున్నారు. అనేక ముఖ్యమైన విషయాలపై అభిప్రాయాలను మార్పిడి చేసుకునేందుకు శ్రీ నందా ప్రధానినిరోజూ కలుసుకుంటూ ఉన్నారు నేటి సమావేశంలోభారత్-పాకిస్తాన్ దేశాల హోంశాఖ మంత్రుల సమావేశాన్ని గురించి చర్చించినట్లు భావిస్తున్నారు.

తమ తమ దేశాలలోని మైనారిటీలకురక్షణ కల్పిస్తామని హామీ యిస్తూ శ్రీ నందా, పాకిస్తాన్ హోంమంత్రి ఖాన్ అబీబుల్లా ఖాన్‌ల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు యిటీవల నడిచాయి

హోం శాఖామంత్రుల సమావేశం గురించి లండన్ నుండి ప్రకటన వెలువడిన తరువాత ఖాన్ అబీబుల్లాఖాన్‌కు వ్రాసిన లేఖలో, జాతి మత విచక్షణలేకుండా భారతదేశంలోని పౌరులందరూ రాజ్యాంగంలోని హామీలు, సమాన హక్కులు అనుభవిస్తున్నారని శ్రీ నందా వ్రాసినట్లు తెలుస్తోంది. ఈ హామీలు మరింత బాగా అమలు జరిగేటట్లు చూడాలని భారత ప్రభుత్వం భావిస్తోంది.

భారతదేశంలోని అయిదు కోట్ల మంది మహమ్మదీయులు యితర ప్రజలతోబాటు సమాన పౌర హక్కులు అనుభవిస్తున్నారని కూడా శ్రీ నందా తెలియజేశారు.

అస్సాం నుండి కొంతమందిని వెళ్ళగొట్టటానికి కారణం, వారు విదేశస్థులుకావటం. పర్మిట్లు లేకుండా భారత దేశంలోనికి రావటమేనని తెలియ జేశారు, భారతీయ పౌరుణ్ణి వెళ్ళగొట్టటంగానీ బాధించటంగానీ జరుగకుండా ఉండటానికి పూర్తి పరిపాలనా సంబంధమైన న్యాయ సంబంధమైన పద్ధతులు అవలంబించినట్లు కూడా తెలియ చేశారు. ఈవిధానాలను యింకా మెరుగు పర్చటానికి ఏమైనా సూచనలు చేసినట్లయితే భారత ప్రభుత్వం పరిశీలించటానికి సిద్ధంగా ఉన్నదనికూడా తెలియజేశారు

జంషెడ్‌పూర్, రూర్కెలాలలో జరిగిన అల్లర్లను భారతప్రభుత్వం అణచివేసిన తరువాత, దేశం మొత్తంమీద శాంతి, సామరస్యం నెలకొన్నదనికూడా తెలియజేశారు.

మత సామరస్యం నెలకొల్పటానికి యిప్పుడు తీసుకున్న చర్యలకు తోడుగా, మైనారిటీలకు మరింత రక్షణ కల్పించటానికి ఇంకా చర్యలు తీసుకోవటానికి భారత ప్రభుత్వం సిద్ధంగాఉన్నదని కూడా వ్రాశారు.

మైనారిటీలు నివసిస్తున్న ప్రాంతాలలో శ్రీ నందా పర్యటించాలనికోరుతూ అబీబుల్లా ఖాన్ వ్రాసిన ఉత్తరానికి సమాధానంగా యీ ఉత్తరం వ్రాశారు.

ఏ ప్రాంతంలోనైనా రక్షణ లేదనేభావం ఉన్నట్లయితే, ఆ ప్రాంతానికి తాను వెళ్తాననీ కాని దేశంలో యిప్పుడు శాంతి నెలకొన్నదని శ్రీ నందా తెలియ జేసినట్లు తెలుస్తోంది.

జయసూర్య చితాభస్మం గోదావరిలో నిమజ్జనం

రాజమండ్రి, జూలై 14

కీ॥ శే॥ డాక్టర్ జయసూర్య చితాభస్మాన్ని రాజమండ్రివద్ద గోదావరిలో నిమజ్జనము చేయడానికిగాను మొన్న పూరీ ప్యాసింజరులో ఇక్కడికి తెచ్చారు. డా॥ జయసూర్య సతీమణి డా॥ ద్వారకాబాయి, వారి బంధువు దీనదయాళ్, శ్రీ పిలకా కృష్ణమూర్తిగారలు వున్నారు.

రాజమండ్రి స్టేషన్‌లో చితాభస్మ పాత్రకు శ్రద్ధాంజలి సమర్పించటానికి డా॥ జి.వి భట్ డా॥ యం. రామకృష్ణారావు, డా॥ పిలకా దీక్షితులు, డా॥ శేరీ దంపతులు, శ్రీ చిట్టూరి ప్రభాకరచౌదరి, శ్రీ ఏలూరు సూర్యారావు శ్రీ ముత్యాల చినఅప్పలస్వామి తదితర అభిమానులు పలువురు వచ్చారు

చితాభస్మాన్ని డా॥ శేరీగారి ఇంటికి చేర్చాక అక్కడే శ్రద్ధాంజలి సభ జరిపారు. సభకు డా॥ పిలకా దీక్షితులు అధ్యక్షత వహించారు

డా. ఎం. రామకృష్ణారావు స్వాగతం చెప్పారు. అధ్యక్షులు శ్రీ దీక్షితులు, డాక్టరు జయసూర్య వైద్యులుగానే కాక జనసామాన్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఏ విధంగా బీదలకు సేవచేయగలమనే ఆలోచనతోహోమియో వైద్యాన్ని చేబట్టారని అన్నారు.

శ్రీ చిట్టూరి ప్రభాకర చౌదరి మాట్లాడుతూ ఆయన అన్ని పురోభివృద్ధికర, ప్రజాతంత్ర ఉద్యమాల నన్నిటినీ బలపరుస్తూ వచ్చారనీ, భారత – సోవియట్ సాంస్కృతిక మండలి (ఆంధ్ర) అధ్యక్షులుగా పనిచేశారనీ, వారి కుటుంబం జాతిమత భేదాలుండరాదనే వాంఛకు ఆదర్శప్రాయమైనదనీ, ఛాందసభావాల నెదిరించడానికి ముందుండి సాహసమైన జీవితం గడిపారనీ అన్నారు.

శ్రీయుతులు జి వి భట్, ఏలూరి సూర్యారావు, పొన్నాడ శ్రీరామమూర్తి, హరనాద్, పిలకా కృష్ణమూర్తిగారలు కూడా ప్రసంగించారు.

జయసూర్య అస్థికల కలశంపై పుష్పాంజలి

విజయవాడ, జూలై 12

కీర్తిశేషులు డాక్టర్ జయసూర్య అస్థికలను గోదావరినదిలో నిమజ్జనం చేయుటకు హైదరాబాదు పూరి ప్యాసింజరులో వెళ్లుతున్న జయసూర్య సతీమణి డాక్టర్ ద్వారకాబాయి, డాక్టర్ కృష్ణమూర్తిగార్లను జూలై 12వ ఆంధ్రప్రదేశ్ హోమ్యోపతి వైద్య సంఘ అధ్యక్షులు డాక్టర్ గాదిరాజు వెంకటేశ్వరరావు ఆంధ్ర హోమియోపతి బోర్డు సభ్యులు డాక్టర్ ఎస్. చంద్రమౌళి, కృష్ణాజిల్లా హోమియో వైద్యసంఘ అధ్యక్షులు డా॥ జి. వీరభద్రాచార్యులు: కృష్ణాజిల్లా హోమియోపతి వైద్యసంఘ ఉపాధ్యక్షురాలు డా॥సి. మంగమ్మ, కార్యదర్శి డా॥ సూర్యప్రకాశరావు సంయుక్త కార్యదర్శి డా॥ శ్రీ విశ్వేశ్వరశర్మ: డా॥ జి. సుబ్బరాజు డా॥ టి. వి. కృష్ణారావు, డా॥ ఎస్ రామారావుగారలు విజయవాడ రైల్వేస్టేషనులో కలుసుకొన్నారు.

కీర్తిశేషుని అస్థికల కలశంపై వీరు పుష్పమాలలనుంచి తమ భక్తి, శ్రద్ధలను వెల్లడించారు.

శ్రీ జయసూర్య స్మృతిచిహ్నంగా హైదరాబాదులో ఒక హోమియో వైద్యశాలను, కళాశాలను స్థాపించవలసినదిగా ప్రభుత్వము వారిని అర్థిస్తూ కృష్ణాజిల్లా హోమియోవైద్య సంఘం వారు ఒక తీర్మానం కూడా ఆమోదించారు.

తుంబావద్ద మరొక రాకెట్ ప్రయోగం

తిరువనంతపురం, జూలై 14

వాతావరణంలోని ఎగువ పొరలలో వాయు ప్రసారాలను గురించిన సమాచారం సేకరించేందుకు, కేరళలో తిరువనంతపురం సమీపంలోవున్న తుంబా కేంద్రం వద్ద నేడొక వాతావరణ పరిశోధక రాకెట్‌ని ప్రయోగించారు. అంగుళంలో అయిదు వేల వంతు మందమూ, రెండంగుళాల పొడవుగల రాగి సూదులను ఈ రాకెట్ మోసుకువెళ్లింది.

రేపుగాని, ఎల్లుండిగాని మరొక రాకెట్‌నీ, వచ్చే పన్నెండు మాసాల్లో మొత్తం 24 రాకెట్లను ప్రయోగిస్తామని, ప్రయోగ అధికారి డాక్టర్ హెచ్. జి. యస్. మూర్తి తెలిపారు.

నేటి ప్రయోగం అమెరికా వాతావరణ పరిశోధక సంస్థ సహకారంతో, హిందూ మహాసముద్ర అంతర్జాతీయ పరిశోధకమండలి సలహాల ప్రకారం జరిగిందని అధికారులు తెలిపారు.

ఢిల్లీలో లైసెన్సులు లేని రేడియోలు

370 పట్టివేత

న్యూఢిల్లీ, జూలై 14

ఢిల్లీ తపాలా శాఖాధికారులు ఈ సంవత్సరము ఏప్రిల్ నుండి జూన్ వరకు 370 లైసెన్సులు లేని రేడియోలు పట్టుకున్నారు.

స్వంత రేడియోలుఉన్నవారు తమ లైసెన్సులతో సిద్ధంగాఉండమని నేడొక పత్రికా ప్రకటనలో ప్రజల్ని తపాలా శాఖవారు హెచ్చరించారు.

ఢిల్లీలో ఇల్లు కూలి ఇద్దరు స్త్రీల మరణం

న్యూఢిల్లీ జూలై 14

పాతఢిల్లీలో నేడు ఒక ఇల్లు కూలిపోవటం మూలంగా ఇద్దరు స్త్రీలు చనిపోయారు, మరో ముగ్గురికి గాయాలు తగిలాయి.

భారీవర్షాలు కురవటంతో పట్నంలో కూలిపోయిన యిండ్లమూలకంగా వీటితో యింత వరకూ పన్నెండుమంది చనిపోయారు. మరో ఇరవైమందికి గాయాలు తగిలాయి.

ఈ ప్రమాదం జరిగిన యిల్లు శిధిలావస్థలో ఉన్నందున ఖాళీ చేయమని మునిసిపల్ అధికారులు ఇంట్లోఉంటున్నవారికి ముందుగానే హెచ్చరికచేశారు. ఈహెచ్చరికననుసరించి మిగిన వారంతా యిల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయారు.

నేడు పట్టణంలో మరో యిల్లు కూడా కూలిపోయింది అయితే అగ్నిమాపక దళంవారు ఇద్దరిని రక్షించారు. తరువాత వారిద్దరిని ఆస్పత్రిలో చేర్పించారు.

మారిటానియాతో రష్యా దౌత్యసంబంధాలు

మాస్కో, జూలై 14

మారిటానియా సోవియట్ దేశాలు పరస్పరం దౌత్య సంబంధాలను ఏర్పరచుకోడానికి ఒప్పందంకుదిరిందని మాస్కోలో సంయుక్త ప్రకటన వెలువడింది.

నూతన విద్యాపద్ధతి ప్రకారం పెదపాడు సమితిలో ప్రాథమిక పాఠశాలలలో 6 వ తరగతిని నాలుగు పాఠశాలల్లో ప్రవేశ పెడతారని హనుమాన్ జంక్షన్‌లో పెదపాడు సమితి సీనియర్ విద్యావిస్తరణ అధికారి శ్రీ సదాశివరావు చెప్పారు.

ఇరాక్‌లో భీమా, బ్యాంకు వ్యాపారాల జాతీయకరణ

బాగ్దాద్, జులై 14

ఇరాక్‌లో భీమా కంపెనీలనూ, బ్యాంకులనూ, ఉక్కు, సిమెంట్ మొదలైన కొన్ని పరిశ్రమలనూ జాతీయంచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది. ప్రధాని లెఫ్టినెంట్ జనరల్ తాహెర్‌యాహాయా ఈ ఉత్తర్వును రీజా చేశారు.

దీని ఫలితంగా తొమ్మిది బ్యాంకులు జాతీయ మవుతున్నాయి. ఈ తొమ్మిది బ్యాంకుల మొత్తంపెట్టుబడి ఒక కోటి, ఇరాక్ దీనార్లు (సుమారు పదిహేను కోట్ల రూపాయలు) ఉంటుందని ఆర్థికవర్గాల అంచనా

ఇరాక్‌లో 1958 లో రాచరిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన విప్లవ వార్షికోత్సవ సందర్భంలో ప్రధాని యాహాయా ఈ జాతీయకరణ విషయాన్ని రేడియో, టెలివిజన్ ప్రసారాల్లో ప్రకటించారు

తివాసీల పరిశ్రమలనూ, వనస్పతి పరిశ్రమలనూ, గృహ నిర్మాణ సరకుల కంపెనీలనూ, జౌళిమిల్లులనూ, ధాన్యం మిల్లులనూ, కాగితం పరిశ్రమ కంపెనీనీ, సిగరెట్, సబ్బు ఫ్యాక్టరీలనుకూడా ఈఉత్తర్వుద్వారా ప్రభుత్వం జాతీయం చేసింది.

ఈజాతీయకరణ ఉత్తర్వుక్రిందికి వచ్చే ఏ సంస్థలో నయినాసరే విధ్వంసక చర్యలకు ఒడిగట్టేవారికి మరణశిక్ష లేదా, యావజ్జీవ కఠిన శిక్ష విధించే ఒక కొత్త చట్టాన్నికూడా ప్రధాని యాహియా నేడు ప్రకటించారు.

ప్రభుత్వం ఒకక్క ఆర్థికసంస్థనుఏర్పాటు చేస్తుందనీ, అందులో పారిశ్రామిక వాణిజ్య, భీమా రంగాలకు విడి విడిగా విభాగాలుంటాయనీ యాహాయా ప్రకటించారని బాగ్దాద్ రేడియో తెలిపింది.

చౌ-ఎన్-లై బర్మా ప్రయాణంపై ఊహాగానం

పెకింగ్, జూలై 14

ఇరాక్ విప్లవ దినోత్సవం సందర్భంలో పెకింగ్‌లోని ఇరాక్ రాయబార కార్యాలయంలో నేడుజరిగినవిందుకు చైనాప్రధాని చౌ-ఎన్-లై, విదేశాంగమంత్రి చెన్ యీ కూడా వచ్చారు.

వారు రంగూన్ నుండి ఈ వేళే పెకింగ్ నగరానికి తిరిగి వచ్చారు.

వీరిద్దరూ తలవనితలంపుగా రంగూన్ వెళ్లినతరువాత సంయుక్తప్రకటన ఒకటి వెలువడినప్పటికీ, వీరెందుకంత హుటాహుటీని రంగూన్ వెళ్ళారో పెకింగ్‌లోని దౌత్యవర్గాలకు నేటికీ అగమ్యగోచరంగానే ఉంది.

బర్మా, చైనాల మధ్య 1960 లో జరిగిన స్నేహ నిరాక్రమణ ఒడంబడికలోని మూడవ నిబంధనను ఆ సంయుక్త ప్రకటనలో ఉల్లేఖించడంలోనే అసలు కీలకం ఉందని ఇక్కడి దౌత్య వర్గాలు అనుకుంటున్నారు.

ఒకరిపై నొకరు దురాక్రమణ చర్యలకు ఒడిగట్టబోమనీ, ఈ రెండు దేశాల్లో ఒకదానికి వ్యతిరేకంగా ఏర్పడే సైనిక కూటములలో రెండవది పాల్గొనకూడదనీ ఆ మూడవ నిబంధనలో ఉంది.

సోమాలియా మంత్రివర్గ పతనం

మొగాడిషు, జూలై 14

సోమాలియాలో మాజ్జి హుస్సేన్ మంత్రివర్గం పట్ల విశ్వాస ప్రకటన తీర్మానం ఈ వేళ పన్నెండుఓట్ల తేడాతో ఓడిపోయింది. తీర్మానానికి అనుకూలంగా 57 ఓట్లు, వ్యతిరేకంగా 69 ఓట్లు వచ్చాయి.

ఈ విశ్వాస ప్రకటన తీర్మానంపై మూడు రోజులపాటు చర్చ జరిగినమీదట ఈ వేళ ఓటింగు జరిగింది.

తేయాకు కార్మికుల వేతనాల పెంపకం అవసరం

వేతనాలబోర్డు సిఫారసు

కలకత్తా, జూలై 15

తేయాకు తోటలలో పనిచేసే కార్మికులకు రెండవసారి తాత్కాలికంగా వేతనాలుపెంచాలని తేయాకు పరిశ్రమ కేంద్ర వేతనాలబోర్డు సిఫారసుచేసినట్లు నేడిక్కడ అధికారయుతంగా తెలియవచ్చింది.

ఏ తేదీనుండి ఈ పెంపుదల ఇంకా నిర్ణయం కాలేదని తెలుస్తున్నది.

ఈ పెంపుదలవల్ల ఈశాన్య ప్రాంతంలో పనిచేసే 7 లక్షలమంది తేయాకుతోటల కార్మికులకు లాభం కలుగుతుందనీ అందువల్ల ఏటా అదనంగా 2 కోట్లు ఖర్చవుతుందనీ తెలుస్తున్నది.

మిగతా ప్రాంతాలలోని కార్మికులకు కూడా కొంత లాభం కలుగుతుంది, అయితే వివరాలు ఇంకా తెలియటంలేదు.

గతనెలసమావేశమయిన తేయాకుపరిశ్రమ కేంద్ర వేతనాలబోర్డు, తేయాకు తోటపనివారు తరచుపనికి హాజరుకాకపోవటం పెరుగుతున్నదని పేర్కొన్నది. గైర్‌హాజరుకాకుండా కార్మికులు పనిలోకి వచ్చేటట్లు చూడవలసిందిగా, కార్మిక సంఘాలను కోరింది.

పరస్పర అంగీకారంద్వారా పని భారాన్ని మార్చినా, లేక బాధ్యతలను మార్చినా ఏ అడ్డంకు లేదనీ, అలాచేయటం త్రైపాక్షిక సమావేశ నిర్ణయాలకు విరుద్ధంకాదనీ పేర్కొన్నది.

కాశ్మీర్‌లో కాంగ్రెసు సంస్థను నిర్మించే సమస్యపై యీ నెల 18 వ జరిగే జాతీయ మహాసభ కార్యవర్గసమావేశంలో తుదినిర్ణయం జరుగుతుంది.

సభలు - సమావేశాలు

నర్సాపురం తాలూకా నాయీ బ్రాహ్మణ సంఘ మహాసభ జులై 21వ పాలకొల్లులో జరుగుతుంది.

దక్షిణాది రాష్ట్రాల్లో బియ్యానికి గరిష్ఠ ధర

ఆహారమంత్రుల సమావేశంలో అంగీకారం కుదిరిందని శ్రీ సుబ్రహ్మణ్యం ప్రకటన

మద్రాసు, జూలై 14

దక్షిణ ఆహారమండలంలో బియ్యానికి గరిష్ఠ చిల్లర, టోకు ధరలునిర్ణయించటానికి నేడిచ్చటజరిగిన రాష్ట్ర ఆహారశాఖామంత్రుల సమావేశంలో ఒక అంగీకారం కుదిరింది.

కేంద్ర ఆహార, వ్యవసాయశాఖ మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం సమావేశానికి అధ్యక్షత వహించారు.

సమావేశానంతరం శ్రీ సుబ్రహ్మణ్యం పత్రికావిలేకరులతో మాట్లాడుతూ బియ్యానికి గరిష్ఠ టోకు, చిల్లరధరలు నిర్ణయించాల్సిన అవసరం గురించి అంగీకారం కుదిరిందనీ, దక్షిణమండలంలోని రాష్ట్ర ప్రభుత్వాలు వచ్చే శుక్రవారం లోపల తమ సూచనలు పంపటానికి అంగీకరించాయనీ చెప్పారు

కేంద్ర ప్రభుత్వం వచ్చే వారంలో ప్రతి రాష్ట్రానికివర్తించే విధంగా ధరలు నిర్ణయించి ప్రకటిస్తుందని చెప్పారు.

గరిష్ఠ ధరలను పకడ్బందీగా అమలు జరపటానికి వెంటనే ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయటానికి రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించాయని కూడా చెప్పారు.

సమావేశంలో కేరళ, ఆంధ్ర ప్రదేశ్, మద్రాసు రాష్ట్రాల ఆహార శాఖామంత్రులు, మద్రాసు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి పాల్గొన్నారు మైసూరు రాష్ట్ర ఆహారశాఖ మంత్రి సమావేశానికి హాజరు కాలేదు. కాని ఆహార సరఫరాశాఖ డైరెక్టరు సమావేశంలో పాల్గొన్నారు.

ఈ నిర్ణయించే ధరలు యీ సంవత్సరం డిసెంబరుతో ఆఖరయ్యే తరుగు మాసాలకు మాత్రమేనని మద్రాసురాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి శ్రీ ఆర్. వెంకట్రామన్ పత్రికా వారితో మాట్లాడుతూ తెలియజేశారు. కొత్త పంట రాగానే యిప్పుడు నిర్ణయించిన ధరలు సమీక్షచేసి, కొత్త ధరలను ప్రకటిస్తారని, తెలియ జేశారు.

కేంద్ర ప్రభుత్వం నిర్ణయించే ధరలను అమలు జరపటానికి అవసరమైన యంత్రాంగాన్ని మద్రాసు ప్రభుత్వం ఏర్పాటు చేస్తుం దన్నారు.

తరువాత ఆహారధాన్యాల వ్యాపారుల, బియ్యం మిల్లుల యజమానుల సంఘ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ శ్రీ సుబ్రహ్మణ్యం గరిష్ఠధరలను నిర్ణయించే పథకం గురించి వివరించారు.

గరిష్ఠ ధరలను అమలు జరపాలని వారిని కోరాననీ, అందుకు వారు అంగీకరించారనీ శ్రీ సుబ్రహ్మణ్యం తరువాత పత్రికా విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు.

మనస్థైర్యంచెడని సరిహద్దు ప్రజలు

జమ్మూ, జూలై 15

సరిహద్దు అవతలనుంచి పాకిస్తాన్ సైనికులు కాల్పులుజరుపుతున్నా, జమ్మూ సరిహద్దులలో నివసించే భారత ప్రజలలో మనోధైర్యం చెక్కుచెదర లేదని పి. టి. ఐ. విలేకరి వ్రాస్తున్నారు.

సరిహద్దులలోని మన సైనికులపట్ల, పోలీసుల పట్ల అక్కడి ప్రజలకు పూర్తి విశ్వాసం వుందని ఆయన వ్రాస్తున్నారు.

పాకిస్తాన్ కాల్పులవల్ల బాగా నష్టపడ్డ ఒక గ్రామం సందర్శించిన తర్వాత పత్రికా విలేకరులకు కలిగిన అభిప్రాయం యిది ఆ గ్రామ ప్రజలు యుద్ధ విరమణ రేఖవెంటా వెళ్ళి పొలంపనులు చేసుకుంటున్నారు.

100 సంవత్సరాల వయస్సున్న ఒక వృద్ధ స్త్రీని పత్రికా విలేకరులడిగిన ప్రశ్నకు సమాధానం యిస్తూ, 'నేను చాలాకాలంగా ఈ కాల్పులు చూస్తున్నాను. ఈ గ్రామంలో ఎవ్వరూ భయపడి పారిపోలేదు అన్నారు

కాల్పులు జరుపుతున్నప్పుడు భూమిపై 'దొర్లపడుతుంటే. అది చాలా క్షేమం' అని కూడా ఆవిడ అన్నారు

ఆ సమీపంలో ఒక గస్తీకేంద్రం వద్దనున్న జవాన్లను చూపిస్తూ మా ప్రాణాల రక్షణకు, మా బిడ్డలు అక్కడ వున్నారు. అటువంటప్పుడు 'మేము ఎందుకు అనవసరంగా భీతిచెందాలి' అన్నదావిడ

అప్పుడే పొలం పనికివెళ్ళి తన ముగురు పిల్లలతోసహా తిరిగివచ్చిన 32 ఏండ్ల మహిళను కూడ విలేకరులు ప్రశ్నలు వేశారు,

'నేనూ కులాసాగా, హాయిగా వున్నాను' అందావిడ

కేంద్ర ఆహార వ్యవసాయశాఖల మంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం ఆ శాఖలను నిర్వహించ దానికి బహుసమర్థుడైన వ్యక్తి అని రాష్ట్రపతి ప్రశంసించారు.

జౌళి పరిశ్రమలో పనిగంటల పెంపు

ప్రతిపాదనపట్ల కార్మిక మంత్రిత్వశాఖ సందిగ్ధస్థితి

న్యూఢిల్లీ జూలై 15

వాణిజ్య మంత్రిత్వశాఖ ప్రతిపాదించిన విధంగా జౌళి పరిశ్రమలో 54 గంటల వారాన్ని ఆమోదించితే, అందుకు అంతర్జాతీయ కార్మిక సంస్థ తప్పుపట్టవచ్చని కేంద్రకార్మికమంత్రిత్వ శాఖ ప్రతినిధి ఒకరు నిన్న యిక్కడచెప్పారు.

అయితే వారాంతపు శెలవు సమస్యను మాత్రం యజమానులూ కార్మికులూ ఉభయ వర్గాల సమ్మతితో సర్దుబాటు చేయవచ్చుని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు.

వాణిజ్య మంత్రిత్వశాఖ చేస్తున్న ఈ రెండు ప్రతిపాదనలూ ఈ మాసాంతంలో బెంగుళూరులో జరిగే త్రైపాక్షిక కార్మిక మహాసభలో చర్చకు రానున్నవి.

28 వ తేదీన కేంద్ర కార్మిక మంత్రి రాష్ట్ర మంత్రులతో యిష్టాగోష్ఠిగా సంప్రదింపులు జరుపుతారు.

ఆఫ్రికా సమైక్య సంస్థ సమావేశం

తాను వెళ్ళడంలేదని మొరాకో రాజు ప్రకటన

రాబట్, జూలై 14

కైరోలో జరిగే ఆఫ్రికా సమైక్యసంస్థ సమావేశానికి తాను హాజరుకావటంలేదని మొరాకో రాజు హసన్ నేడిక్కడ ఒక రేడియో టెలివిజన్ గోష్ఠిలో వెల్లడించారు.

కాంగో ప్రధాని షోంబే హాజరవటానికి సిద్ధపడుతున్నందున తాను నిర్ణయం చేసుకున్నా నన్నాడు.

షోంబే కూర్చున్న టేబుల్‌దగ్గర తాను కూర్చోలేనని ఆయన అన్నారు.

మొరాకో విదేశాంగమంత్రి గుదీరా సమావేశానికి హాజరవుతారు. కాంగోతో మనకేమీ వ్యక్తిగతమయిన విభేదాలులేవు. వారం రోజులలో లియోపాల్డ్‌విల్లీలో మన రాయబారిని కూడా నియమిస్తాం" అన్నారు.

వావిలాల చూపిన కాగితంతో అసెంబ్లీలో కొద్దిపాటి కలవరం

హైదరాబాద్ జూలై 14

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య చూపిన ఒక చిన్నకాగితం నేడు శాసనసభలో కొంత కలవరం కలిగించింది.

పంచాయతీసమితుల సవరణబిల్లుపై జరిగిన చర్చలో ఆయన పాల్గొంటూ తన జేబులో నుండి ఒక కాగితంలాగి, బ్లాకుల పునర్వ్యవస్థీకరణలో ప్రభుత్వ లక్ష్యాలను, ఇది స్పష్టం చేస్తున్నదన్నారు.

శ్రీ వావిలాలచూపిన కాగితంపై ఒక పంచాయతీ సమితి కమిటీ సమావేశం ఎజెండా వుంది. అదే కాగితంమీద, ఆ బ్లాకు కాంగ్రెస్ పార్టీ మీటింగ్ నోటీసుకూడావుంది ఆ కాగితం మీద బి. డి. ఓ. సంతకం బ్లాక్ కాంగ్రెస్, అధ్యక్షుని సంతకం వున్నాయి

ఆ కాగితాన్ని శ్రీ గోపాలకృష్ణయ్య స్వీకరిస్తూ, సమితి వ్యవహారాలలో కాంగ్రెస్ జోక్యానికిది తిరుగులేని ఉదాహరణ అన్నారు.

పాక్‌లో నిర్బంధంగా ఖురాన్ బోధ

ఢాకా, జూలై 15

ముస్లిం బాలబాలికలందరికీ ప్రాథమిక పాఠశాలలో నిర్బంధంగా ఖురాన్‌ను బోధించాలని ఒక సభ్యుడు ప్రతిపాదించిన తీర్మానాన్ని తూ. పాకిస్తాన్ శాసనసభ నిన్న ఆమోదించింది.

ఈ తీర్మానాన్ని శ్రీ ఎజులాల్ కబీర్ చౌదరి ప్రతిపాదిస్తూ, పశ్చిమ దేశాల జీవిత విధానం క్రమంగా పాకిస్తాన్‌లో వేళ్లూను కుంటున్న దన్నారు. ప్రజలలో బానిస మనస్తత్వం ఇంకా పోలేదని చెప్పారు.

ఇదేపద్ధతి కొనసాగితే పాకిస్తాన్ ఇస్లాం ప్రాతిపదికే బలహీనపడగల దన్నారు.

పశ్చిమ పాకిస్తాన్ తంతిపనివారి విజయం

కరాచీ, జూలై 14

తమ కోర్కెలలో అత్యధికభాగాన్ని ప్రభుత్వం ఆమోదించినందున గత నాల్గు రోజులుగా సమ్మె చేస్తున్న పశ్చిమ పాకిస్తాన్ టెలిగ్రాఫ్ కార్మికులు నేడు సమ్మె విరమించారు. సమ్మె చేసినందుకు ఎవరినీ పనినుండి తొలగించబోమని అధికారులు హామీ యిచ్చారు. మిగిలిన కోర్కెలను త్వరలోనే పరిశీలించుతామని తెలియజేశారు

యస్. జీ. వోల వేతనాలపై 2వ కమిషన్ నియామకానికి
ముఖ్యమంత్రి నిరాకరణ

హైద్రాబాద్, జూలై 14

వేతనాల పునరవ్యవస్థీకరణ, మొదలైన యస్. జీ. ఓ లు ఉపాధ్యాయుల కోర్కెలను పరిశీలించడానికి, ఒక కమిటీని గానీ, కమిషన్‌ను గానీ నియమించేది లేదని ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి స్పష్టంగాచెప్పారు.

కమ్యూనిస్టు ప్రజాతంత్ర పక్ష సభ్యులు శ్రీ వి సర్వేశ్వరరావు, వంకా సత్యనారాయణ అడిగిన ప్రశ్నకు మంత్రి సమధానం యిస్తూ ఈ సమస్య పరిష్కారానికి ధరల స్థిరీకరణే మార్గమని, అందువల్ల ధరల స్థిరీకరణ విషయంలో ప్రభుత్వం తన దృష్టిని కేంద్రీకరిస్తుందని చెప్పారు

మంత్రి యింకా యిలా అన్నారు:

వేతనాలు పెరిగిన వెన్వెంటనే ధరలుకూడా పెరుగుతాయి. అది ఒక విష చక్రంగా తయారవుతుంది గాని వేతనాల పెంపుదల వల్ల నిజంగా ప్రయోజనం ఏమీ వుండదు.

ధరలస్థిరీకరణ బాధ్యత ప్రధానంగా కేంద్రానిదే గనుక, ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తెచ్చాం.

4 వ ఫైనాన్సు కమిషన్ పరిశీలనాంశాలలో దీనిని కూడా చేర్చమని సూచించాము. అనేక రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఈ సూచనను ఆమోదించారు. కాని కేంద్ర ఆర్థిక మంత్రి ఈ ప్రతిపాదనను తిరస్కరించారు

జపాన్‌లో మాదిరిగా ఆహార పదార్థాలకు ప్రభుత్వం సబ్సిడీ యివ్వవలసిందిగా డాక్టర్ టి వి. యస్. చలపతిరావు అడిగిన ప్రశ్నకు, అటువంటి ప్రతిపాదన ఏదయినా అఖిలభారత స్థాయిలో పరిశీలించాలన్నారు.

హైద్రాబాద్‌లో కూడా కొంతమంది ప్యూన్లకు రు 40 లు వేతనంగా యిస్తున్నారనీ, కనీసం రు 75 లు అయినా ఇవ్వాలని శ్రీ పోతుల గున్నయ్య చేసిన సూచనకు మంత్రి సమాధానం యిస్తూ, కనిష్ఠవేతనం రు 100 లుగా నిర్ణయించాలని ప్రభుత్వం ఆశయమనీ, సాధ్యమయినంత త్వరలో ఆ లక్ష్య సాధనకు ప్రయత్నిస్తున్నామనీ అన్నారు.

పాలకొల్లు ఫ్యాక్టరీ

శ్రీ కె అప్పలనాయుడు అడిగిన ఒకప్రశ్నకు సమాధానమిస్తూ పాలకొల్లు ఫ్యాక్టరీమినహా రాష్ట్రంలోని మిగతా పంచదార ఫ్యాక్టరీలన్నీ తమ లక్ష్యాలను సాధించాయని చెప్పారు. సహకార రంగంలోనూ, అలాగే ప్రయివేటు రంగంలోనూ మరికొన్ని పంచదార మిల్లులను నెలకొల్పవలసి వుంటుందని ఆయన అన్నారు. పాలకొల్లు ఫ్యాక్టరీపనినిమెరుగుపర్చేందుకు రు. 10 లక్షలు అప్పుగా ప్రభుత్వం యిచ్చిందన్నారు. ఈ సంవత్సరం ఉత్పత్తి లక్ష్యం సాధించటం ఖాయమన్నారు.

బెల్లం ధర బాగా వున్నందున రైతులు తమ చెరకును ఫ్యాక్టరీకి తోలడానికి చురుగ్గా ముందుకు రావడంలేదనీ అందువల్ల కొన్ని గ్రామాలలోని చెరకు అచ్చితంగా పంచదార ఫ్యాక్టరీలకు తోలాలని నవంబరులో రక్షణ చట్టంక్రింద ప్రభుత్వం అర్డర్లు జారీ చేసిందని అన్నారు.

అక్రమంగా జరిగిన బ్లాకుల పునర్విభజన
శాసనసభలో పలువురివిమర్శ

హైద్రాబాద్, జూలై 14

బ్లాకుల పునర్విభజన సరిగా జరగలేదని నేడు శాసనసభలో పంచాయతీచట్టం సవరణ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంలో పలువురు సభ్యులు ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. (ఈ వార్త అందినంతమేరకు నిన్న ఇచ్చాం.)

ప్రతిపక్ష నాయకులు పిల్లలమర్రి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బ్లాకుల పునర్విభజన అన్యాయంగా జరిగిందన్నారు.

సవరించిన బిల్లును తిరిగి ప్రాంతీయ కమిటీకి పంపాలని సూచించారు.

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య మాట్లాడుతూ బి. డి. ఓలు అధికారపార్టీ చేతుల్లో, సమితి అధ్యక్షుల చేతుల్లో కీలుబొమ్మలవుతున్నారని విమర్శించారు

బ్లాక్ మీటింగ్ నోటీసు, కాంగ్రెస్‌పార్టీ మీటింగ్ నోటీసువున్న ఒక కాగితాన్ని ఆయన స్పీకరుకు యిచ్చారు. ఒకే కాగితంపై రెండు నోటీసులు వున్నాయి. ఈ విషయమై దర్యాప్తు జరపాలని ఆయనకోరారు. బ్లాక్ డెవలప్‌మెంటు ఆఫీసర్లు కూడా, సమితిలోని అధికార పార్టీ పనులను చూస్తున్నారని అన్నారు.

శ్రీ యస్ వెంకటస్వామి మాట్లాడుతూ సంజీవరెడ్డిమాదిరిగా మంత్రివర్గం రాజీనామా చేయాలన్నారు.

పంచాయితీ సమితులకు తిరిగి ఎన్నికలు జరపాలని శ్రీ తెన్నేటి విశ్వనాథం అన్నారు.

యస్ మోహనరావు (సి. డి. యల్. యఫ్) ఇలా అన్నారు

ఒరంగల్ జిల్లాలో ముందు 15 బ్లాకులు ఏర్పాటు చేశారు. తర్వాత 13 కు తగ్గించారు. మళ్ళీ ఆ తర్వాత 14 కు పెంచారు. ఈ సర్దుబాట్లన్నీ పాలకవర్గపార్టీకి అనుకూలత సాధించటం కోసమే జరిగింది.

యమ్. లక్ష్మణస్వామి (సి. డి. యల్. యఫ్). ఇలా అన్నారు:

బ్లాకుల పునర్విభజన విషయంలో ప్రభుత్వం ఒక నిర్దిష్టవిధానాన్ని అనుసరించలేదు. కనీసం జనాభానయినా దృష్టిలో వుంచుకోలేదు కొన్ని గ్రామాలలో జనాభా 80 వేలుంటే కొన్నింటిలో 1,30,000 వరకూ వున్నారు.

ఎ. వెంకటేశ్వరరావు: ఎక్కడఅన్యాయం జరిగిందో ముందు ప్రభుత్వం పరిశీలించాలి. పరిషత్ సభ్యులతోనూ, శాసన సభ్యులతోనూ, పంచాయతీ సమితి సభ్యులతోనూ సంప్రతించాలి, ఒరంగల్ జిల్లాలో ఒకచోట మరో భాగాన్ని కలిపి రెండుగా చేశారు. అలాచేస్తే రెండింటిలోనూ గెలవటానికి అవకాశం వుండటమే దీనికికారణం.

హైద్రాబాద్ కార్పొరేషన్ సవరణ బిల్లు

హైద్రాబాద్, జూలై 14

హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సవరణ) బిల్లును మున్సిపల్ పరిపాలనా వ్యవహారాల శాఖామంత్రి శ్రీ అలపాటి వెంకట్రామయ్య నేడు శాసనసభలో ప్రవేశపెట్టారు

ఈ బిల్లువల్ల మోటారు రవాణాలపైనున్న పన్నువేసే అధికారం కార్పొరేషన్‌కు లేకుండా పోతుంది.

ఇందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ మొత్తం జనాభాకు లెక్కగట్టి తల 1రు 30 పైసలు చొ॥న నష్ట పరిహారం యిస్తుంది అంటే యేటా 3 35,566 రూపాయలు ఇవ్వవలసి వుంటుంది.

దుర్గాపూర్ ఫ్యాక్టరీ ఉత్పత్తి పెరుగుదల

న్యూఢిల్లీ, జూలై 15

దుర్గాపూర్ ఉక్కు ఫ్యాక్టరీలో యీ సంవత్సరం తొలి ఆరు మాసాలలో గత సంవత్సరం తొలి అర్ధభాగంకంటే ఉత్పత్తి పెరిగింది.

ఈ సంవత్సరం జనవరి, జూన్ మాసాల మధ్య యీ ఫ్యాక్టరీలో 6,84,619 టన్నుల దుక్క యినుము (గత సంవత్సరం కంటే 49,700 టన్నులు హెచ్చు). 5,18,474 టన్నుల ఉక్కు దిమ్మెలు (గత సంవత్సరం కంటే 34,400 టన్నులు హెచ్చు) తయారు చేశారు.

ఈ పెరుగుదల ఫ్యాక్టరీ ఉత్పత్తి లక్ష్యాలకూ, దేశీయ మార్కెట్‌లో దుక్క ఇనుము అవసరాలకూ అనుగుణంగానే వుందని అధికారవర్గాలుతమసంతృప్తిని వ్యక్తం చేస్తున్నవి.

'ప్రథమశ్రేణికి చెందిన నైతిక శక్తి'
ప్రపంచంలో బ్రిటన్‌పాత్రపై ఆచార్యవినోబాఅభిప్రాయం

ఇండోర్, జూలై 14

నేటి ప్రపంచ లో ఇంగ్లండు ప్రథమ శ్రేణికి చెందిన నైతికశక్తి అనీ, దానిని "రెండో శ్రేణికి చెందిన రాజ్యంగా" పేర్కొనడం సరికాదని ఆచార్య వినోబాభావే నేడిక్కడ అభిప్రాయం వెలిబుచ్చారు.

వార్ధా సమీపంలోని పవ్నార్‌లో జరిగిన ప్రార్థనా సమావేశంలో ప్రసంగిస్తూ ఆచార్య వినోబాభావే ప్రపంచ పరిస్థితిని గురించి తన అభిప్రాయాలను వివరించారు.

ఈపరిస్థితుల్లో ప్రపంచంలో ఏకపక్ష నిరాయుధీకరణబాధ్యతను ఇంగ్లండు-భారతదేశాల్లో ఏదో ఒకటి మాత్రమే తీసుకొన గలుగుతుందని ఆయనన్నారు.

గతంలో జరిగిన రెండు ప్రపంచ యుద్ధాల కాలంలోనూ అన్ని దేశాల్లో ధరలు అయిదునుండి ఏడు రెట్లవరకూ పెరిగాయి. కాని ఇంగ్లండులో మాత్రం ధరలు 10 శాతం మాత్రమే పెరిగాయి. దీనినిబట్టి అక్కడి ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలపట్ల ఎంతటి చక్కటి వైఖరిని కలిగివున్నదో స్పష్టమవుతున్నదని శ్రీ ఆచార్య వినోబా అన్నారు.

అలాగే బ్రిటిష్ ప్రజలు ద్వితీయ ప్రపంచ యుద్ధకాలంలో తమ దేశ నాయకత్వ బాధ్యతను విన్‌స్టన్ చర్చిల్‌కు అప్పగించారు. అప్పగించిన పని పూర్తి అయిన వెంటనే ఆయనకు బ్రిటిష్ ప్రజలు గౌరవపూర్వకమైన వీడ్కోలు నిచ్చారు. ప్రధానమంత్రి పదవి నుండి తప్పుకొన్న తరువాత చర్చిల్ కూడా తన దేశ రాజకీయాలకు దూరంగా వున్నారు.

అలాగే మొదట నిర్ణయించిన తేదీకి బ్రిటన్ భారత దేశంలోని తన అధికారాన్ని అప్పచెప్పింది. మరో ఆరు మాసాలు వుండవలసిందిగా దేశ అగ్రనాయకులు కోరినా, బ్రిటన్ తన నిర్ణయం ప్రకారం జరిపింది.

ఈ మూడు ఉదాహరణలను బట్టి ప్రపంచంలో ఒక్క ఇంగ్లండే "నైతికశక్తి" అని చెప్పవచ్చునని ఆచార్య వినోబా అభిప్రాయం వెలిబుచ్చారు.

యు. పి. కాంగ్రెసు ఎన్నికల తగాదా
ఈ వారంలో శ్రీ నందా నివేదికసమర్పణ

న్యూఢిల్లీ, జూలై 14

ఉత్తరప్రదేశ్ కాంగ్రెసుకు యిటీవలజరిగిన ఎన్నికలపై ఈ వారంలో ఎప్పుడో ఒకప్పుడు తన నివేదికను కాంగ్రెసు అధ్యక్షునికి సమర్పించగలనని కేంద్ర హోమ్‌మంత్రి శ్రీ నందా నేడిక్కడ చెప్పారు.

ప్రదేశ్ కాంగ్రెసు ఎన్నికలపై అజమాయిషీ జరపవలసిందిగా శ్రీ నందాను కాంగ్రెసు వర్కింగుకమిటీ పంపించింది.

నందాకు పార్లమెంటుసభ్యుడు శ్రీ లలితసేన్ సహాయపడ్డారు.

శ్రీ నందా తన సిఫార్సులను తయారు చేయడం రేపు పూర్తిచేయగలరని అనుకొంటున్నారు.

జాతీయ ఆదాయం
వి. కె. ఆర్. వి. రావు వివరణ

బొంబాయి, జూలై 14

భారతదేశంలో నెలకు 20 రూపాయల తలసరి ఆదాయాన్ని సాధించాలన్న లక్ష్యాన్ని నెరవేర్చే పథంలో ఐదవ ప్రణాళికాంతానికి జాతీయాదాయం 37వేలకోట్లరూపాయలకు చేరగలదని ప్రణాళికాసంఘ సభ్యులు శ్రీ వి. కె. ఆర్. వి. రావు నేడిక్కడ నొక్కిచెప్పారు

ప్రస్తుత మూడవప్రణాళికాంతానికి 17 వేల కోట్ల రూపాయలకు చేరగలదని భావిస్తున్న జాతీయాదాయం తరువాత పది సంవత్సరాల్లో రెట్టింపుకు ఎక్కువగా పెరగవలసి వుంటుందన్నారు.

ప్రణాళికాసంఘ లక్ష్యాలు

వచ్చే పది సంవత్సరాల్లో దేశాభివృద్ధికి ప్రణాళికాసంఘం ఈ క్రింది నాలుగు లక్ష్యాలను రూపొందించిందని చెప్పారు.

1 భారతదేశంలోని ప్రతివ్యక్తికి నెలకు తలసరి కనీస ఆదాయం ఇరవై రూపాయలు ఉండేలా హామీ యివ్వడం.

2. అందరికీ పూర్తి ఉద్యోగావకాశాలు అదనపు ఉద్యోగావకాశాలను సులభతరం చేసేందుకు వీలు కల్పించే ఆర్థిక వ్యవస్థను రూపొందించడం.

3 విదేశీ సహాయంపై ఆధారపడకుండా జాతీయ వనరులపై ఆధారపడి సంవత్సరానికి యేడుశాతం చొప్పున ఆర్థిక సంపదను పెంచేలా చేయడంద్వారా దేశ ఆర్థిక విధానంలో స్వయంపోషకత్వాన్ని సాధించడం

4. ప్రస్తుతంఉన్న ఆదాయాలలోని వ్యత్యాసాలను తగ్గించడం ద్వారా సాంఘిక లక్ష్యాన్ని సాధించడం. ఆర్థిక సంపద కేంద్రీకరణను తగ్గించడం.

ఈ లక్ష్యాల సాధనకు ప్రస్తుతం మూడవ ప్రణాళికాంతానికి వ్యయపరిచే 21 వేల కోట్ల రూపాయలకు మారుగా 5వ ప్రణాళికాంతానికి 56వేల కోట్ల రూపాయలనువ్యయంచేయవలసి వుంటుందనికూడా ఆయన చెప్పారు

ఈ వ్యయం చాలా అధికంగా కనిపించినప్పటికీ ఇది జాతీయాదాయం పెంపుదలకు అనుగుణ్యంగా వుండగలదని అన్నారు.

భారీ పరిశ్రమలు, గనులు (16 వేల కోట్ల రూపాయలు) రవాణా సౌకర్యాలు (పదివేలకోట్ల రూపాయలు) విద్యుచ్ఛక్తి (ఆరు వేల కోట్ల రూపాయలు) లాంటి పథకాలపై ఎక్కువ మొత్తాలు ఖర్చు చేయ బడుతాయని ఆయన అన్నారు. వ్యవసాయ రంగంలో 5 వేల 5 వందలకోట్ల రూపాయలను వినియోగించవలసి వుంటుందన్నారు.

పన్నుల పెరుగుదల

పన్నుల విషయంలో క్రమానుగతంగా పెరుగుదల వుండవచ్చుననీ, నాలుగవప్రణాళికా కాలంలో రు 6 వందల కోట్లు 5 వ ప్రణాళికా కాలంలో రు 8 వందల కోట్లు ఉంటుందని కూడా ఆయన అన్నారు.

ప్రణాళికల లక్ష్యసిద్ధి

నాలుగవ, అయిదవ పంచవర్ష ప్రణాళికల లక్ష్యసిద్ధి ఈ క్రింది ఆరు సూత్రాలపై ఆధార పడివుంటుందని ఆయన చెప్పారు

1. అమ్మకాలు పెరుగుదల దేశంలో అమ్మకం కనీసం 21 శాతం మేరకు పెరగాలి.

2. పొదుపు పెరుగుదల. ఈ మొత్తంలో అధికభాగం దేశంలో సంపాదనా పరులైన వారిలో నూటికి తొంభై అయిదు మందిగా వున్న స్వల్పాదాయ పరుల నుండి రావాలి.

3 పన్నుల వసూళ్లు

4. ప్రభుత్వరంగ పరిశ్రమలనుండి లాభాలు సంపాదించడం.

5. నాలుగవ ప్రణాళికలో వేయినుండి రెండువేల కోట్లరూపాయల వరకూ ఎగుమతులు పెరగగలవని భావించిన ఎగుమతి లక్ష్యాలను సాధించడం. పెరిగిన ఉత్పత్తిలో కొంతభాగాన్ని ఎగుమతులనుండి మినహాయించి ఉంచడం.

6. దేశీయ యంత్రపరికరాల ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడం.

ఆహార ధాన్యాల ధరల నిర్ణయం

ఆహార ధాన్యాల ధరల నిర్ణయాన్నిగురించి కూడా శ్రీ రావు నొక్కి చెప్పారు. ఈ ధరల నిర్ణయం వ్యవసాయదారునికి ప్రోత్సాహం కలిగించేదిగా వుండాలని, ఇది ప్రస్తుతం ఉన్న విధంగా ప్రతి పంట తరుణానికి నిర్ణయించే విధంగాకాకుండా కొంతకాలానికి ఒకేపర్యాయం ఈ ధరలు నిర్ణయం జరగాలని ఆయన చెప్పారు.

"భారత ఆర్థిక విధానానికి వ్యవసాయమే ప్రాతిపదికగా ఉండేటంతవరకూ ధరలను కంట్రోలుచేయడం, పంపకాన్ని క్రమబద్ధం చేయడం తప్పనిసరి" అని అన్నారు. ప్రణాళికలు స్వరూపంలో పెద్దవిగా వుండాలని కాకుంటే తీవ్ర పరిణామాలు ఏర్పడతాయనీ ఆయన చెప్పారు.

శ్రీ రావు బొంబాయి రోటరీక్లబ్‌లో ప్రసంగిస్తూ పై విధంగా చెప్పారు.

బర్మా, సింహళలోని భారతీయులకు నష్టపరిహారం

మద్రాసు, జూలై 15

బర్మా, సింహళ ప్రభుత్వాలు అనుసరించుచున్న వాణిజ్య విధానం, జాతీయకరణపంథావల్ల నష్టపడే భారతీయులకు తగు నష్టపరిహారం పొందడానికి భారతప్రభుత్వం ప్రయత్నించాలని బ రా ప. మానవ హక్కుల ఉపసంఘం అధ్యక్షులు డాక్టర్ ఎ కృష్ణస్వామి విజ్ఞప్తిచేశారు.

అలా కోరటం సమంజసమనీ, గత 17 సంవత్సరాలుగా తన మిత్రులకు భారతదేశం యిచ్చిందనీ ఆయన అన్నారు.

కాశ్మీరులో నేటి పరిస్థితులు
శ్రీ నందా సరిదిద్దగలరని, రాజకీయ పరిశీలకుల ఆశాభావం

శ్రీనగర్, జూలై 15

దేశ వ్యవహారాల మంత్రి శ్రీ నందా త్వరలోనే కాశ్మీరును సందర్శించబోతున్నారు. రాష్ట్రంలో నేడున్న పరిణామాలదృష్ట్యా ఆయన రాకకు ఇక్కడ అత్యధిక రాజకీయ ప్రాధాన్యతను యిస్తున్నారు.

శ్రీ నందా యిక్కడికి వచ్చే తేదీని యింకా అధికారరీత్యా ప్రకటించక పోయినప్పటికీ ఆయన జూలై మూడో వారంలో రాగలరని అనుకొంటున్నారు

షేక్ అబ్దుల్లా ఇప్పటికీ కాశ్మీరులో వివాదానికి కేంద్రంగా వుంటున్నారు. అయన ఎలాంటి వైఖరి తీసుకొంటారనే విషయమై భారత - పాకిస్తాన్ దేశాల ప్రజలకు, ప్రభుత్వాలకు యింకా వూహాగానంగానేవుంది. ఆయన జైలు నుండి విడుదలై నెలలు గడిచినా ఆయన నిజమైన వైఖరి ఎవరికీ అర్థంకాకుండా అయోమయంగానేవుంది. ఆయన పలికేమాటలు ఒక్కోసారి ఆశలను రేకెత్తించుతాయి మరొకప్పుడు ఆయన వెలిబుచ్చే అభిప్రాయాలు బాధను కలిగించుతాయి.

షేక్ అబ్దుల్లా యిటీవల సాదిక్ ప్రభుత్వంపై ప్రారంభించిన దాడి అందరినీ ఆశ్చర్యపరచడమేగాక, బాధను కూడా కలిగించింది. ఎందువల్లనంటే చాలా కాలానికి సాదిక్ ప్రభుత్వం కాశ్మీరుకు పరిశుభ్రమైన, సుస్థిర పరిపాలన యివ్వగలిగిందని ప్రజలు భావించుతున్నారు.

మరోవైపున షేక్ అబ్దుల్లాకు, ఇటీవలనే కాశ్మీరు అవామీ యాక్షన్ కమిటీ 'ని నెలకొల్పిన మీర్ వజీమౌలీఫరూక్‌కీమధ్యబహిరంగంగానే ఘర్షణలు జరగడంవలన పాకిస్తానీ అనుకూలురు అబ్దుల్లాపై ఆశలనువిడనాడినట్లు అర్థమవుతోంది అవామీ యాక్షన్‌కమిటీ ప్రధానంగా మతశక్తులపై ఆధారపడివుంది. అందువలన వారికీ - అబ్దుల్లా మధ్య విభేదాలు ఏర్పడటం అందరికీ సంతోషాన్ని కలిగించింది. అబ్దుల్లా విడుదల కాకముందు వారంతా ప్రజలను అబ్దుల్లా నాయకత్వంకోసం ఎదురుచూడమని చెప్పుతూ వచ్చారు

అయితే షేక్ అబ్దుల్లా యిటీవల చేస్తున్న ప్రసంగాలు చూస్తుంటే పాకిస్తాన్‌తో కాశ్మీరును విలీనం చేయాలన్న ఉద్యమానికి వారు నాయకత్వం వహించబోరని అర్థమవుతున్నది.

కాశ్మీరు ప్రజలు పాకిస్తాన్‌లో చేరడానికి సమ్మతించుతారనే భావంతోనే "కాశ్మీరు అవామీ యాక్షన్ కమిటీ" వారు ప్లెబిసైట్‌ను డిమాండ్ చేస్తున్నారు.

మరోకవైపున యుద్ధవిరమణ రేఖవద్ద పాకిస్తాన్ ప్రోత్సాహంతో గెరిల్లా చర్యలు సాగుతున్నాయి యుద్ధవిరమణరేఖను మాటిమాటికి ఉల్లంఘించుతున్నారు. భారతదేశాన్ని వేరుపరచి లొంగ దీసుకోవాలని అయూబ్‌ఖాన్ ప్రపంచ మంతటిలోనూ తన దూతల చేత చేయించుతున్న ప్రచారంలోని భాగమే ఈ సరిహద్దు వుల్లంఘనలు.

ఈ పరిస్థితిలో శ్రీ నందా రాకకు ఇక్కడ పరిశీలకులు అత్యధిక ప్రాధాన్యతను యిస్తున్నారు. పాకిస్తాన్ ప్రభుత్వ దాడిని అరికట్టేందుకు శ్రీ నందా దృఢమైన చర్యను తీసుకోగలరని అందరూ ఆశించుతున్నారు.

కజక్‌స్తాన్‌లో మంచి పంటలు
సుప్రీం సోవియట్ వెల్లడి

మాస్కో, జూలై 14

ఈ సంవత్సరం కజక్‌స్తాన్ రిపబ్లిక్‌లో ఆహారపంటలు బాగా పండాయని, ఆరిపబ్లిక్ కార్యదర్శి ఇస్మాయిల్ యుసుపోవ్ నేడు సుప్రీం సోవియట్ ఎగువసభలో చెప్పారు. అయితే, పంటమార్పిడి సకాలంలో జరగటం కష్టం కావచ్చునని హెచ్చరించారు.

రష్యా రిపబ్లిక్ గ్రామీణ ప్రాంతాలలో పని చేసే డాక్టర్లకు, ఉపాధ్యాయులకు తమ ప్రభుత్వం ఉచిత నివాస వసతి, తదితర సౌకర్యాలు కల్పించుతుందని. ఆ రిపబ్లిక్ డిప్యూటీ ప్రధాని తెలియచేశారు. దీనివల్ల పట్టణాలనుండి కొంత మందిని పల్లెలకు ఆకర్షించడానికి వీలవుతుందన్నారు.

పబ్లిక్ సర్వీసులలో పనిచేసే వారికి జీవన ప్రమాణాన్ని సమిష్టి వ్యవసాయ క్షేత్ర రైతుల జీవన ప్రమాణాన్ని పెంచడానికి సంవత్సరం ప్రభుత్వం ముఖ్యచర్యలు తీసుకుం నిన్న కృశ్చేవ్ అన్నారు సమిష్టి వ్యవసాయ క్షేత్రరైతులు ఈ దేశవ్యాపిత పెన్షన్ పథకాన్ని ప్రవేశ పెడతామని అయన చెప్పారు.

ప్రస్తుతం దేశంలో 5 లక్షలమందిడాక్టర్లున్నారని, 1953 కంటే ఈ సంఖ్య 186,000 అధికమని ఆరోగ్యమంత్రి తెలిపారు.

సోవియట్ పురుషుల సరాసరి ఆయు ప్రమాణం 65 సంవత్సరాలని, స్త్రీల సరాసరి ఆయు ప్రమాణం 63 సంవత్సరాలని అన్నారు.

రాయ్‌పూర్ దగ్గర రైలు పట్టాలు తప్పి కొన్నివాగన్ల ధ్వంసం

రాయ్‌పూర్, జూలై 14

నాగపూర్‌నుండి, బిలాస్‌పూర్ వెళుతున్న ఒక గూడ్సు రైలు "యుర్కేడా" స్టేషన్‌వద్ద పట్టాలు తప్పి కొన్నివాగన్లుధ్వంసమయ్యాయి.

ఆగ్నేయ రైల్వేలోని, రాయపూర్-బిలాస్‌పూర్ సెక్షన్‌లో రాయపూర్‌కు 4 మైళ్ళ సమీపంలో ఈ ఘటన జరిగింది.

చతుర్థ ప్రణాళికలో రవాణా రహదార్లపద్దు

న్యూఢిల్లీ, జూలై 14

నాలుగవ ప్రణాళికలో రహదారీ రవాణా సౌకర్యాలకు, సమాచార ప్రచారాలకు ఆయా మంత్రివర్గ శాఖలు ప్రతిపాదించిన నాలుగు వేల 38 కోట్ల రూపాయల పద్దు ప్రస్తుతం ప్రణాళికా సంఘ పరిశీలనలో ఉన్నది.

దీనిలో ఎక్కువ వాటా రు 1731 కోట్ల రైల్వే పద్దు ప్రతిపాదన ఉంది రోడ్డు రవాణాకు రు 1150 కోట్లు, రేవులకు రు 2 వందల కోట్లు, పరిశ్రమకు 150 కోట్లు రహదారి సౌకర్యాలకు రు. 416 కోట్లు, సమాచార ప్రచారానికి రు. 52 కోట్లు ఈ పద్దుల్లో ప్రతిపాదించబడ్డాయి.

మూడవ పంచవర్ష ప్రణాళికలో రవాణా రహదారీ సౌకర్యాలకు రు 1486 కోట్లు ప్రాథమికంగా కేటాయించారు. ఈ ప్రణాళిక మధ్యంతర పరిశీలన తరువాత రవాణా రహదార్ల అంచనా వ్యయం రు. 2100 కోట్లు. రవాణా అవసరాల అంచనా ప్రకారం నాలుగవ ప్రణాళికంతానికి రైల్వేలు సరకులను రవాణా చేసే పరిమితి 36 కోట్ల టన్నుల మేరకు వుంటుంది. అయితే బొగ్గుఉత్పత్తి, ఇతర అవసరాలను దృష్టిలో ఉంచుకొంటే ఈ పరిమితి దాదాపు 30 కోట్ల టన్నుల మేరకు ఉండగలదని భావిస్తున్నారు

1970-71 నాటికి రోడ్డు రవాణా పరిమితి 12కోట్ల టన్నుల మేరకుంటుందని అంచనా

భారత దేశాన్ని గురించి బ్రిటిష్ ప్రజలకు తెలియపర్చండి
శ్రీమతి ఇందిరాగాంధిఉద్బోధ

లండన్ జూలై 14

ప్రధాన ప్రపంచ సమస్యల పైన, భారత దేశపై వైఖరిని భారత దేశంలో జరుగుతున్న విస్తృత మార్పులను గురించి బ్రిటిష్ ప్రజలకు తెలియ చెప్పవలసిందిగా భారత సమాచారశాఖ మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ నేడు ఇండియా లీగుకు విజ్ఞప్తి చేసింది.

ఇండియాలీగ్‌వారు ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆమె ప్రసంగిస్తూ భారతదేశంలో అనేక మంది విదేశ పత్రికా విలేకరులు ఉన్నప్పటికీ భారతదేశంలో జరుగుతున్న మార్పులను గురించిగాని లేదా ప్రధాన అంతర్జాతీయ సమస్యలపైన భారతదేశ వైఖరిని గురించిగాని అంతగా బ్రిటిషు ప్రజలకు తెలియటం లేదని ఆమె అన్నారు.

గత కొద్ది సంవత్సరాలుగా భారత, బ్రిటన్ దేశాలమధ్య పరస్పరావగాహన పెరుగుతున్నది. అయితే ఇది సరిపోదు. కామన్వెల్తు ద్వారా బ్రిటన్‌తో భారత దేశానికి సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ, భారతదేశాన్ని గురించి బ్రిటిష్ ప్రజలకు బహుకొద్దిగా మాత్రమే తెలవటం విచారకరం.

భారత ప్రజల దృక్పథంలోను, అభిప్రాయాలలోను అనేక మార్పులు వస్తున్నాయని ముఖ్యంగా భారత మహిళలలో ఈ మార్పులు రావటం పేర్కొనదగినవని ఆమె అన్నారు.

భారతదేశంలో అక్కడక్కడా చిన్న తగాదాలున్నప్పటికీ జాతీయతా భావం అంతా వ్యాపించి ఉన్నదని ఆమె అన్నారు.

భారతదేశం నేడు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నదని. వాటిని పరిష్కరించుకుంటూ సక్రమ మార్గంలో అదేశం పయనిస్తుందని ఆమె అన్నారు.

శ్రీ త్యాగితో చెస్టర్ బౌల్స్ భేటీ

న్యూఢిల్లీ, జూలై 14

అమెరికా రాయబారి చెస్టర్ బౌల్స్ కేంద్ర పునరావాసశాఖా మంత్రి శ్రీ మహవీర త్యాగిని నేడిక్కడి కలుసుకున్నారు వీరిద్దరూ దాదాపు ఒక గంటపాటు సంభాషణలు జరిపారు.

తూర్పు పాకిస్తాన్ నుండి భారతదేశంలోకి విపరీతంగా వచ్చే కాందిశీకుల విషయమై వీరు ప్రధానంగా సంభాషించారని తెలుస్తున్నది.

ఇంతవరకూ దాదాపు ఐదులక్షల మందికి పైగా పాక్ కాందిశీకులు భారత దేశంలోకి వచ్చిన విషయం పాఠకులకు విదితమే.

అమెరికానుండి సోయా చిక్కుళ్ల నూనె దిగుమతి

న్యూఢిల్లీ, జూలై 15

పి యల్ 480 అమెరికా సహాయ పథకం క్రింద వనస్పతి పరిశ్రమకు ఉపకరించే లక్ష టన్నుల సోయా చిక్కుళ్ళ నూనెను, సబ్బు పరిశ్రమకు ఉపయోగించే 50 వేల టన్నుల క్రొవ్వువస్తువులనూ దిగుమతి చేసుకొనడానికి ప్రాథమిక సన్నాహాలు పూర్తి అయినట్లు తెలుస్తోంది.

ఈ విషయమై సంప్రతింపులు పూర్తి చేసుకొని ఈ సరకులను వెంటనే దిగుమతి చేసుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేయడంకోసం, వనస్పతి, సబ్బు పరిశ్రమలకు సంబంధించిన ప్రతినిధులు, అధికార ప్రతినిధుల నాయకత్వాన త్వరలోనే అమెరికా బయలుదేరి వెళ్ళనున్నారు.

ఈ విషయమై కేంద్ర వాణిజ్య మంత్రి శ్రీ మనూభాయ్‌షా ఈ మధ్య వాషింగ్‌టన్‌కు వెళ్ళినప్పుడు అమెరికా ప్రభుత్వంతో సంభాషించారు ఈ ప్రతిపాదనకు అమెరికా అధికారులు చాలా అనుకూలంగా ఉన్నట్లు తెలుస్తుంది

న్యూఢిల్లీలోని అమెరికాదౌత్య కార్యాలయం ఈ ప్రతిపాదనను అమెరికా ప్రభుత్వానికి పంపిన తోడనే భారతీయ ప్రతినిధివర్గం అమెరికా బయలుదేరి వెళుతుందని తెలుస్తుంది.

పుస్తకాల ప్రచురణకు కేంద్ర బ్యూరో
నెలకొల్పడానికి ప్రతిపాదన

న్యూఢిల్లీ జూలై 14

పుస్తకాల ప్రచురణకు కేంద్రబ్యూరో నొకదానిని నెలకొల్పే ప్రతిపాదనను కేంద్ర విద్యామంత్రిత్వశాఖ పరిశీలిస్తున్నది. హిందీ లోనుతదితరభారతీయ భాషలలోపాఠ్యపుస్తకాల ప్రచురణ అనువాదాలు, ప్రామాణిక గ్రంథాల ప్రచురణలలో ఈ బ్యూరో ప్రధానమైనపాత్ర వహించగలదు.

ప్రామాణికమైన గ్రంథాల ప్రచురణల ద్వారా హిందీ తదితర భారతీయ భాషలను సుసంపన్నం చేయడమే ఈ పథకాన్ని రూపొందించడంలో ముఖ్య వుద్దేశమైనట్లు చెపుతున్నారు.

ఈ ప్రతిపాదనను ప్రణాళిక సంఘం ధృవీకరించే పక్షంలో ఈ పథకాన్ని నాలుగవ ప్రణాళికలో చేర్చ వచ్చునని తెలుస్తూ వుంది

ద. వియత్నాంకు క్రొత్తగా అమెరికా సైనికనిపుణులు

వాషింగ్‌టన్ జూలై 15

అత్యంత ఉన్నతశిక్షణపొందిన 600 అమెరికా సైనిక నిపుణులను దక్షిణ వియత్నాంకు పంపుతున్నట్లు అమెరికా రక్షణశాఖ నిన్న ప్రకటించింది.

వీరిలో 300 మంది మిలటరీ నిపుణులు ప్రత్యక్షంగా సైనిక రంగంలోవుండివియత్‌నామ్ కాంగ్ గెరిల్లాలతో పోరాడే ద వియత్నాం ప్రభుత్వ సైనికులకు సహాయ పడతారు.

మిగతా 300 మంది ప్రత్యేకరకం సైనిక నిపుణులు, దీనితో ద. వియత్నాంలోని అమెరికా ప్రత్యేక సైనిక నిపుణుల సంఖ్య 700 నుండి 1000 కి పెరిగింది

పాకిస్తాన్ అధ్యక్ష ఎన్నికలలో మౌలనాబషానీ పోటీ

ఢాకా, జూలై 15

ప్రతిపక్ష పార్టీలన్నీ అంగీకరించిన కనీస కార్యక్రమం ప్రాతిపదికపై వచ్చే అధ్యక్ష ఎన్నికలలో అయూబ్‌ఖాన్‌కు వ్యతిరేకంగా, తాను పోటీచేస్తానని నేషనల్ అవామీ పార్టీ అధ్యక్షుడు మౌలానాబాషానీ నిన్న ఇక్కడ పునరుద్ఘాటించారు

నేడు పెషావర్‌లో జరిగే నేషనల్ అవామీ పార్టీ కేంద్ర కార్యవర్గంలో తన అభ్యర్థిత్వ విషయం చర్చకు పెడతానని ఢాకా విమానాశ్రయంలో ఆయన చెప్పారని పాకిస్తాన్ వార్తా సంస్థ ప్రకటించింది

లక్నో పట్టణంలో ఆహారం అదృశ్యం

లక్నో, జూలై 15

ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నోలో యీ వారంలో గోధుమలకూ, పిండికీ విపరీతమైన కొరత యేర్పడింది చౌక దుకాణాలలోనూ, ప్రయివేటు చిల్లరకొట్లలో గూడా ఉన్నట్లుండి సరుకు మాయమై పోయింది బ్లాక్ మార్కెట్‌లో గోధుమలు మణుగు 35 రూపాయలకు అమ్మడం ప్రారంభమైంది.

ఉన్నట్లుండి ఒక్కసారిగా యీ పరిస్థితి యేర్పడినందువల్ల నగర ప్రజలు చాలా కటకట పడుతున్నారు. ప్రభుత్వంచేతగానితనంపై విపరీతమైన ఆగ్రహావేశాల్ని వెలిబుచ్చుతున్నారు

వర్తకులకు ప్రభుత్వం లొంగుబాటు

రాష్ట్ర ప్రభుత్వం వ్యాపార వర్గాలకు ఒత్తిడికి లొంగి యించుమించుగా వారి స్వేచ్ఛా వ్యాపారాన్ని అనుమతించింది.

ఇతర స్థలాలనుండి ధాన్యం వ్యాగెన్లు వస్తున్నాయనీ, ప్రభుత్వ గోదాముల్లోని సరుకును, పరిస్థితి మరీ కటకటగా వున్న గోరఖ్‌పూర్ ప్రాంతానికి పంపుతున్నామనీ సివిల్ సప్లయ్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

శని ఆదివారాల్లో నగరంలో ఒక వెయ్యి బస్తాల గోధుమపిండి విడుదల చేయించామనీ. మార్కెట్‌లో రూపాయి పెట్టినా శేరు గోధుమ పిండి దొరకకడంలేదని చెప్పడంసరికాదని లక్నో జిల్లామేజిస్ట్రేటు పత్రికలవారికి చెప్పారు

ఈవారం మార్కెట్‌లో బియ్యం మణుగు రు. 38 ల మొదలు 60 రూపాయల వరకు అమ్ముతున్నారు. చిల్లర వర్తకులు ధరలను మరింత పెంచి అమ్ముతున్నారు.

పప్పుల ధరలు గూడా విపరీతంగా పెరిగిపోయాయి.

అస్సాంలో ఆహారపరిస్థితి
క్లిష్టంగావుందని ఆందోళన

షిల్లాంగ్, జూలై 14

ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో పాల్గొని ఇక్కడకు తిరిగి వచ్చిన అస్సాం ముఖ్యమంత్రి శ్రీ బి. పి. చాలిహా ఇక్కడ పత్రికలవారితోమాట్లాడుతూ తన రాష్ట్రంలో ఆహారపరిస్థితి సంతృప్తికరంగానే వుందన్నారు ఇందుకు కారణం గత సంవత్సరం ఉత్పత్తి సంతృప్తికరంగా వుండటమేనన్నారు. అదీగాక ధాన్యసేకరణ కోసం రైసు మిల్లర్లకు లైసెన్సులు మంజూరు చేయాలన్న తన ప్రభుత్వ నూతన విధానం వలనకూడా పరిస్థితి మెరుగుకాగలదని ఆయన చెప్పారు.

కాని ముఖ్యమంత్రి వెలిబుచ్చిన ఆశాభావం సామాన్య ప్రజల్లో ఎక్కడా ఆచరణలో కనపడట లేదు. బియ్యం దొరకక ప్రజలు అవస్థ పడుతున్నారు. దొరికినా సందర్భాల్లో విపరీతమైన ధరలను పెట్టి కొనవలసి వస్తున్నది.

ధాన్య నిల్వలు సంతృప్తికరమని ముఖ్యమంత్రి చెప్పినమాటే నిజమైతే ధాన్యం కొరత ఎందుకుండాలని ప్రశ్నించుతున్నారు. పంట బాగా వున్నదనుకుంటే పండిన దానిలో సగాన్ని అయినా సహకార సంస్థల ద్వారా ఎందుకు ప్రభుత్వం సేకరించలేక పోతున్నది?

ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించితే రాష్ట్రంలో పరిస్థితి అధ్వాన్నం కాగలదని భయపడుతున్నారు. అందువల్ల పరిస్థితి క్షీణించక ముందే ప్రభుత్వం వాస్తవిక పరిస్థితిని గమనించి అందుకనుగుణ్యంగా తగు చర్యలను తీసుకోవలసి వుంటుంది



రేడియో రు10/-లు మాత్రమే

బ్యాటరీ సెల్సుతో పనిచేయు ట్రాన్సిస్టర్ పోకెట్ రేడియో. అన్ని పార్టులు జపాన్‌లో తయారై గ్యారంటీ అయినవి.

మీకు కావలసిన చోటునుండి, సంగీతం వార్తలు మొ॥ వినండి. స్థానికంగా ప్రతిస్టేషన్ ప్రసారం వినబడును. మా నూతన పథకం ప్రకారం.

రు 10/-ల లో ట్రాన్సిస్టర్ మీరు పొందండి. పోస్టేజి మరియు ప్యాకింగ్ రు 2.50 న॥ పై. అదనం, లెదర్ కేస్ ఉచితంగా పంపబడును వి. పి పి ద్వారా అడగండి. నచ్చనిచో ధర వాపసుచేయబడును.

AMERICAN TRADING AGENCY
Durgiana (A 21) Amritsar

ANDHRA UNIVERSITY
WALTAIR.

M. A. Degree in Sociology (Two years)

Two year course for candidates who have passed the B A, with Social Sciences or Humanities or B L, of this University or of any other University recognised as equivalent thereto preference being given to I or II class B A, Degree holders Subjects of study include:

1 Elements of Sociology,
2 General Anthropology,
3 Social Psychology
4 History of Social Thought;
5 Methods of Social Research;
6 Social Structure and Change;
7 Social Institutions in India;
8 Anyone of the following;
  i Rural Sociology,
  ii Urban Sociology,
  iii. Industrial Sociology,
  iv Criminology

Last date for receipt of applications is 25 th July, 64 Application forms can be had from the Principal, University Colleges, Waltair on a postal Order of Re 1/-

PRINCIPAL.

వేలం నోటీసు
పోలవరం గ్రామ పంచాయితీ
ప॥ గో॥ జిల్లా

ది 28-7-64 వ తేదీ మంగళవారం మధ్యాహ్నము 2 గంటలనుండి పోలవరం గ్రామ పంచాయితీకు సంబంధించిన ఈ దిగువ నుదహరించిన అయిటములు బహిరంగముగా పోలవరం పంచాయితీ ఆఫీసులో వేలము వేయబడును పదరు వేలంపాట ఈ పంచాయితీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారిచేగాని వారియొక్క అధికారము పొందిన వారిచేగాని ది 28-7-64వ తేదీ మధ్యాహ్నము 2 గంటలనుండి ప్రారంభించబడును. కావలసినవారు నిర్ణీత దరావతులు చెల్లించి పాల్గొనవచ్చును. యితర వివరములు ఆఫీసు పనిచేయుకాలమందు తెలిసికొనవచ్చును.

(1) పోలవరం పంచాయితీ శాలాకు ఒంగోలుజాతి ఆబోతు - ఒకటి. దరావతు రూ 25/-

(2) పోలవరం పంచాయితీ శాలాకు పాత రబ్బిషు కాగితం ఒకటి - దరావతు రూ 10/-

వి. ఎల్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు,
గ్రామ పంచాయితీ - పోలవరం.
ది 14-7-64

టెండరు నోటీసు
తాడేపల్లిగూడెం మునిసిపాలిటీ

తాడేపల్లిగూడెం మునిసిపల్ ఏరియాలో సుమారు మొత్తం రు. 30,000/- లు విలువ గలిగిన రోడ్డు పనులకు సీలువేసిన టెండర్లు యీ దిగువ సంతకముచేసిన వారిచే ది 27-7-64 తేదీ సాయంకాలం గం. 4 ల వరకు తీసుకొనబడి అదేరోజు సాయంకాలం గం. 4-30 లకు తెరువబడును. టెండరు షెడ్యూల్లు ఆఫీసుపనిచేయువేళలలో ఒక్కొక్కటి రు 2/- లు జమకట్టి పొందవచ్చును. యితర వివరములు ఆఫీసు పనిచేయు వేళలలో మేనేజరుగారి వద్ద నుండి తెలుసుకొనవచ్చును.

మునిసిపల్ ఆఫీసు
తాడేపల్లిగూడెం,
తేదీ 9-7-1964

(సం.) పి. బాలకృష్ణారావు,
కమిషనరు.



ఎన్నో ఏళ్లు నమ్మకముగా పని చేయుటకు
12 హెచ్. పి. - 650 ఆర్. పి. ఎమ్.
లిస్టర్ ఇంజను

ప్రపంచములో అన్ని దేశములలోని వ్యవసాయదారులచే మరియు పారిశ్రామికవేత్తలచే లిస్టర్ 12 2 ఆయిల్ ఇంజను నమ్మకముగా పనిచేస్తుందని పేరు గాంచింది

మెస్సర్స్ ఆర్ ఎ లిస్టర్ అండ్ కంపెనీ లిమిటెడ్ వారి లైసెన్సు క్రింద యిప్పుడు యీ ఇంజనును మెస్సర్స్ లక్ష్మీరతన్ ఇంజనీరింగ్ వర్క్స్ లిమిటెడ్ భారతదేశములో తయారుచేస్తున్నారు.

అమ్మకము తరువాత వీటికి సర్వీసు చయిటకు, విడి భాగములను అందచేయుటకు వోల్టాస్ వారికి ఒక ప్రత్యేకమైన విభాగము కలదు.

ఈ 4 స్ట్రోక్ ఇంజనుయొక్క నిర్మాణము చాల తేలికైనది. ఇది స్పీడు తక్కువైనది. దీని గరిష్టమైన స్పీడ్ 650 ఆర్ పి ఎమ్ మాత్రమే ఇది క్రూడ్ ఆయిల్‌మీద పనిచేస్తుంది దీనిని నడుపుట సులభము మరియు నడుపుటకయ్యే ఖర్చుతక్కువ.

దీనిని ఈ క్రింది పనులకు ఉపయోగించవచ్చును:

● వ్యవసాయపు పనులు ● యంత్రపు నాగళ్లు ● ఎలెక్ట్రిక్ జెనరేటర్స్ ● కాంక్రీట్ మిక్సర్స్ ● కలపను కోసే మిల్లులు ● యంత్రగానుగలు ● పంపులు ● పిండి మరలు ● మగ్గములు ● కట్టడపు పనులకైన 'హాయిస్ట్స్'

VOLTAS వోల్టాస్ లిమిటెడ్, హెడ్ ఆఫీసు: బొంబాయి-1
115-116, ఆర్మీనియన్‌వీధి. మద్రాసు-1 87/D రాష్ట్రపతిరోడ్, సికింద్రాబాద్.

ఆథరైజ్‌డ్ డిస్ట్రిబ్యూటర్లు: కుసుమ హరనాధ్ ఇంజనీరింగ్ కంపెనీ. విజయవాడ,
శ్రీ భాస్కర్ ఆటో మొబైల్స్ & జనరల్ ఏజెన్సీస్, శ్రీ రామదాస్ బిల్డింగ్, కాకినాడ. శ్రీ సరస్వతి ఏజన్సీస్, నెల్లూరు.

సంపాదకవర్గం: కాట్రగడ్డ రాజగోపాలరావు (అధ్యక్షులు) ఏటుకూరు బలరామమూర్తి, తుమ్మల వెంకటరామయ్య. విశాలాంధ్ర విజ్ఞానసమితి తరఫున ఎడిటర్, ప్రింటర్, అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు. స్వతంత్ర ఆర్టు ప్రింటర్స్, విజయవాడ-4.